
# ప్రీతి, భీతి, నీతి

తటవర్తి రాజ్యలక్ష్మి



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో....

# "ప్రీతి", "భీతి", "నీతి"



రచన : తటవర్తి రాజ్యలక్ష్మి

ప్రథమ ముద్రణ : అక్టోబరు, 2024
కాపీలు : 2,000

వెల : రూ. 40/-

పుస్తకముల కొరకు

**తటవర్తి వీర రాఘవరావు**

తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.

సెల్ : 9440309812

## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

**a)** ప్రతిరోజూ ఉదయం **Zoom** లో **4 to 6.30 a.m. Silence Meditation** మరియు **6.30 to 7.30 a.m.** వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

**Zoom I.D. :2413823868, Password : RAO**

**b)** పై కార్యక్రమము **6.30 to 7.30 a.m.** వరకు **Youtube**లో కూడా **Live** ఇవ్వబడుతుంది.

**c)** ఎవరైతే **TVR & TRL Whatsapp** గ్రూపులో వుంటారో వారికి **Zoom Link & You Tube Links** మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా **save** చేసుకోవాలి.

**d)** తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే **www.tst.org.in Open** చేసిన తర్వాత **Join in Whatsapp group** లింక్ మీద నొక్కండి.

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

**a) Whatsapp group** లో మీకు పంపబడుతున్న **Youtube** లింక్ మీద నొక్కినప్పుడు **Tatavarthy Veera Raghava Rao** ఛానెల్ **open** అవుతుంది. **Open** అవ్వగానే **subscribe** కనిపిస్తుంది. దాని మీద నొక్కితే **subscribe** అవుతారు. ప్రక్కనే వున్న **bell button** నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే **www.tst.org.in/videos/** ఓపెన్ అయిన తరువాత **I** లో **Tatavarthy Veera Raghava Rao** పేరు మీద నొక్కండి. **II & III** లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ **Open** అవుతాయి. **Open** అవ్వగానే **subcribe** కనిపిస్తుంది. దాని మీద నొక్కితే **subscribe** అవుతారు. ప్రక్కనే వున్న **bell button** నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

# "ప్రీతి"

ఈ రోజు ప్రీతి, భీతి, నీతి గురించి విశేషంగా చెప్పుకుందాము. మరి ప్రీతి దేని మీద ఉండాలి? భీతి దేని మీద ఉండాలి? నీతి దేని మీద ఉండాలి అన్నది మనం తెలుసుకుందాం.

మన ప్రాపంచిక జీవితంలో ఎంతో బిజీ బిజీగా వుంటాం కానీ ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాకే అసలైన జీవితం జీవిస్తూ ఎక్కడ ఎలా ప్రవర్తించాలి? ఏ విషయం మీద ఎలా ఉండాలి? ఎంత శ్రద్ధ వుండాలి? అనేది మనం తెలుసుకోవలసిన విషయాలు.

మరి ఇవి తెలుసుకోకపోతే మనం జీవించే జీవితం అసలైన జీవితం కాదు. ఏ వ్యక్తి అయినా ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాకే అసలైన జీవితం ఎలా జీవించాలి అన్నది తెలుసుకుంటాడు. కానీ, ప్రాపంచిక జీవితం అంతా ఎలా వుంటుందంటే? నాకు తెలిసిందే కరెక్టు, నేను చేసేదే కరెక్టు అనుకుంటారు. కానీ అలాంటి వారు పూర్తి అజ్ఞానంలో ఉన్నట్లే.

నాకు కొంత తెలుసు, నేను తెలుసుకోవాల్సింది ఎంతో వుందని అనుకున్నప్పుడే ఎవరిలోనైనా ఎదుగుదల ఉంటుంది. అందుచేత ఎంత తెలుసుకున్నా తెలుసుకోవాల్సింది ఇంకా వుంటుంది అన్నది ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. అసలు మనం దేనిమీద "ప్రీతి" అంటే "ఇష్టం" చూపిస్తున్నాము? దేని మీద ఇష్టం చూపించాలి? దేని మీద ఇష్టం చూపిస్తే మన జన్మ సార్ధకం అవుతుంది? అన్నది తెలుసుకోవాలి.

ఎందుకంటే ఈ 'ప్రీతి' అన్నది మామూలుగా అందరికీ తెలిసిన పదమే. కానీ ఈ ప్రీతి అంటే ఇష్టం ప్రతి వాళ్ళు ప్రాపంచిక జీవితం మీదే చూపిస్తున్నారు. అంటే వారి భార్య, పిల్లలు, ఆస్తిపాస్తులు, బంధువులే కాదు, వాళ్ల ఊరు, రాష్ట్రం, దేశం మీద, అంతేకాదు వారి కులం మీద, మతం మీద కూడా ప్రీతి కలిగి వుంటారు. కానీ అసలైన "ప్రీతి" ఎవరి మీద చూపించాలి అనేది తెలియడం

లేదు.

మనకి ఇవన్నీ సద్గురువు దగ్గరికి వచ్చాక, దేని మీద ప్రీతి ఉంటే గొప్పగా ఎదుగుతాము అన్నది అర్ధం అవుతుంది. మరి ముందుగా దేని మీద ప్రీతి ఉండాలి? దేని మీద ప్రీతి ఉంటే జన్మ సార్ధకం అవుతుంది? అన్నది తెలుసుకుందాం.

ముఖ్యంగా సత్యము, ధర్మము. ఈ రెండిటి మీద "ప్రీతి" ఉంటే మన జీవితం బాగుంటుంది. అందుచేత అసలు 'సత్యం' అంటే ఏమిటో ముందుగా తెలుసుకుందాం. దాని మీద ప్రీతి ఎందుకు వుండాలో మనం తెలుసుకుందాం.

## సత్యం అంటే ఏమిటి?

సత్యం అంటే నిత్యమైనది, శాశ్వతమైనది, ఎల్లప్పుడూ వుండేది, మార్పు చెందనిది, అంటే కాలం మారినా యుగాలు మారినా మార్పు చెందనిది సత్యం. అలా మార్పు చెందనిది ఎవరు? అంటే "భగవంతుడు".

అందుచేత అంతగొప్ప భగవంతుడి మీదే మనకు ప్రీతి ఉండాలి. భగవంతుడి మీద ఎందుకు ప్రీతి చూపించాలి? అంటే మన శరీరాన్ని ఆత్మగా నడిపించేది ఆత్మ అంటే భగవంతుడు. ఈ సృష్టిని సృష్టించింది, నడిపించేది ఆ భగవంతుడే అని తెలుసుకోవాలి.

పరమాత్మ లేనిదే పరమాణువు కూడా లేదు అనే సత్యం ఎప్పుడైతే తెలుసుకుంటామో! ఆ భగవంతుడు మీద ప్రీతి పెరుగుతుంది. సృష్టిలోని సమస్త జీవరాసి మనుగడకు కారణం ఆ భగవంతుడే అని తెలుసుకుంటే భగవంతుడి మీద ప్రీతి పెరుగుతుంది. అసలు భగవంతుడు ఎవరు? ఎక్కడున్నాడు అని? కొంతమంది నాస్తిక వాదులు కానీ, హేతువాదులు కానీ అంటుంటారు.

భగవంతుడి ఎక్కడ వున్నాడు? అని అడిగినప్పుడు ఎక్కడ లేదు? అని తిరిగి అడిగితే భగవంతుడు గురించి పూర్ణంగా తెలిసిన వారు అవుతారు.

చాలా మందికి కష్టాలు వచ్చినప్పుడు భగవంతుడు అసలు వున్నాడా?

అని ప్రశ్నలు వేస్తారు. కానీ భగవంతుడు అంటే పరిమిత జ్ఞానంతో రకరకాల పేర్లతో పిలుచుకుంటూ వాళ్ళనే భగవంతుడు అని అనుకుంటారు. అందుచేత భగవంతుడి తత్వాన్ని ఎవరూ తెలుసుకోలేకపోతున్నారు. అంతేకాదు భగవంతుడి గురించి తెలుసుకోలేక పోవడానికి మరొక కారణం అహంకారం. అందుచేత ఎవరైనా చెబితే వినరు.

కానీ పత్రి గారి దగ్గరికి వచ్చినవారు, వారికి తెలియని ఎన్నో రహస్యాలు ఈ ఆధ్యాత్మిక జీవితంలో తెలుసుకుంటున్నారు. దానికి ముఖ్య కారణం పత్రీజీ బోధించిన "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చెయ్యడం. అంతేకాదు ఆ ధ్యానం వల్ల జ్ఞానం కూడా పొందుతున్నారు.

జ్ఞానమంటే భగవంతుని తత్వాన్ని తెలుసుకోవడం. అంటే భగవంతునికి ఆకారం లేదు కాబట్టి ఆయన నిరాకార తత్వాన్ని తెలుసుకోవడమే జ్ఞానం. ఆ జ్ఞానం తెలుసుకునేవరకు మళ్లీ మళ్లీ పుడుతూనే ఉండాలి. అలా ఎన్నో జన్మలు తీసుకుంటూ... ఆ "మాయ"లో పడి, దుఃఖపడతారు.

ఇవన్నీ భాగవతం చదివితే అర్థం అవుతుంది.

"భగవంతుడు" అంటే ఎవరు?

"భగవంతుడు తత్వం" అంటే ఏమిటి?

"ఎక్కడ ఉంటాడు?" "ఎలా ఉంటాడు?"

ఈ తత్వాలు అన్నీ కూడా మనకి భాగవతంలో చాలా చక్కగా ఇవ్వడం జరిగింది.

ఒక మనిషి చూడండి చనిపోయాడు అంటే ఆ మనిషి యొక్క శరీరంలో ఒక్క అవయవం కూడా పని చెయ్యదు. పని చేయటం లేదంటే ఆ శరీరంలో ఆత్మ అనే భగవంతుడు లేకపోవడం వల్లే శరీరం పని చేయటం లేదు అని అర్థమవుతుంది.

మరి అలా భగవంతుడు లేనిది, కానిది, లేదు అనేది కూడా తెలుసుకోవాలి. సృష్టిలో ఏది వున్నా ఆయన సృష్టే! ఆయన తత్వం వల్లే!

ఆయన వల్లే ఈ సృష్టి నడపబడుతోంది! ఆయనే ఇంత అద్భుతమైన సృష్టి మనకి అందివ్వడం జరిగింది.

ఎందుకంటే తల్లి, తండ్రి వారి బిడ్డలు హాయిగా ఉండడానికి ఎన్నో సమకూరుస్తారు. ఆ పిల్లలు హాయిగా వుంటే చాలా సంతోషిస్తారు. అంతేకాదు ఆ పిల్లలు చాలా గొప్పగా చదువుతున్నారు అని ఎవరైనా అన్నప్పుడు, ఆ తల్లిదండ్రులు ఇంకా సంతోషిస్తారు.

అలాగే ఏ మానవుడైనా భూమి మీద శరీరంతో ఉండగా ఆ పరమాత్మని గుర్తించి, ఆ పరమాత్మ మెచ్చే విధంగా తయారవుతే ఆ పరమాత్మ ఉన్న లోకంలోనే వారి స్థానం సుస్థిరమవుతుంది.

ఇవన్నీ తెలుసుకోవాలంటే, ఆధ్యాత్మిక జీవితంలోకి వస్తే గాని తెలుసుకోలేరు. ఈ ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాకే, ప్రాపంచిక జీవితంలో ఎంత హీనంగా బ్రతికామో అన్నది అర్థమవుతుంది. హీనంగా బ్రతకడం అంటే డబ్బు లేకుండా బ్రతకడం కాదు, చదువు లేకుండా బ్రతకడం కాదు, భగవంతుని గురించి తెలియకుండా బ్రతకడం. అంటే భగవంతుడు గురించి ఏమీ తెలుసుకోకుండా నేనే సంపాదించాను, నేను సాధించాను అని అహంకారంతో బ్రతికిన బ్రతుకే హీనమైన బ్రతుకు అంటారు.

ఎందుకంటే సృష్టిలో వున్నవన్నీ ఆయనవే, ఈ సృష్టిని నడిపేది ఆయనే. కొద్దిగా సంపాదించినా, నేను అనుకుంటున్నారు. ఏదైనా కష్టమొస్తే మాత్రం భగవంతుడు నన్ను కష్టపెట్టాడు అంటారు. అంటే మంచి జరిగితేనే గొప్పతనం అంటారు. నీ జీవితంలో చెడు జరిగితే ఆయనే కారణం అంటావు. అంటే ఎంత అజ్ఞానంతో ఆలోచిస్తున్నారో చూడండి.

కానీ అదే ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చినప్పుడు కష్టం కానీ సుఖం కానీ రెండు నా కర్మ ఫలాలే, నేను చేసిన కర్మ ఫలాలే నేను అనుభవిస్తున్నాను అని తెలుసుకుంటారు. అంతేకాదు అలాంటి కర్మ ఇక నేను చేయను అని నిర్ణయించుకుని, మంచి ప్రవర్తనలోకి వస్తారు.

ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాకే భగవంతుడు ఎవరు?భగవంతుడి తత్వం ఏమిటో? సరిగ్గా తెలుసుకుంటారు. ఎందుచేతనంటే? ఈ విషయం సాక్షాత్తు "పరమాత్మ", "బ్రహ్మదేవునికి" శబ్ద రూపంలో చెప్పడం జరిగింది. అందుకే ఈ జ్ఞానాన్నంతా మొట్టమొదట "శృతులు" అంటే "శ్రవణం" ద్వారా వినిపించడం జరిగింది. కాబట్టి బ్రహ్మదేవుడు శృతులు అన్నారు. అంటే భగవంతుని తత్వాన్ని తెలియజేసేదే "శృతులు", దాన్నే జ్ఞానం అంటారు.

అయితే ఆ తత్వాన్ని ఎలా చెప్పాడు? ఏం చెప్పాడు? అని చెప్పుకుంటే "నాలుగే నాలుగు శ్లోకాలు" ద్వారా ఆయనకి చెప్పడం జరిగింది. ఈ జ్ఞానాన్ని సంస్కృతంలో వ్యాసుల వారు చెప్పారు. భాగవతాన్ని తెలుగులోకి అనువదించిన వారు పోతనామాత్యులు. ''పోతన'' వచ్చేవరకు ఈ భాగవతం అంతా సంస్కృతంలోనే ఉంది.

భారతాన్ని తెలుగులో అనువదించిన వారు నన్నయ్య, తిక్కన్న, ఎర్రన్న. సంస్కృతంలో చదవలేని వారి కోసం భాగవతాన్ని పోతనామాత్యులు వారు తెలుగులోకి అనువదించడం జరిగింది.

ఈ నాలుగు శ్లోకాలు గురించి తెలుసుకుంటే భగవంతుడు ఎవరో! ఆయన తత్వం ఏమిటో! అన్నది తెలుస్తుంది. బ్రహ్మదేవుడికి చెప్పిన ఈ నాలుగు శ్లోకాల అర్థాన్ని మనం ఇప్పుడు తెలుసుకుందాం.

"మొట్టమొదటి శ్లోకం" యొక్క అర్థం ఏమిటంటే! "సృష్టికి పూర్వం నేను ఒక్కడినే ఉన్నాను. ఆ తర్వాత సకల చరాచర విశ్వాన్ని నేనే సృష్టించాను, ఈ విశ్వమంతా నేనే సృష్టించి నేనుగా వ్యక్తమయ్యాను అన్నారు. అంటే సృష్టించిన ప్రతి దాంట్లో కూడా పరమాత్మ వున్నాడని తెలుసుకోవాలి. "నేను వ్యక్తమయ్యాను" అని అంటే పరమాణువు నుంచి, ఈ సృష్టి అంతా కూడా "ఆయన రూపమే", "ఆయన శక్తే" అని అర్థం చేసుకోవాలి.

అంతేకాదు ఈ సృష్టి లయం అయ్యాక మిగిలేది "నేనొక్కడినే". అంటే ఈ సృష్టికి పూర్వం "నేను ఒక్కడినే" ఉన్నాను. ఈ సృష్టి వున్నప్పుడు నేను

వున్నాను, “ఈ సృష్టి అంతా మహా కల్పంలో లయమైనప్పుడు” కూడా వుండేది “నేను ఒక్కడినే” అని చెప్పడం జరిగింది.

అంటే సృష్టికి పూర్వము “ఆయనే”, సృష్టిలో వ్యక్తమయ్యేది ఆయనే, సృష్టి లయం అయ్యాక ఉండేది “ఆయన ఒక్కడే”. అందుకే చేయబడింది అంతా మారిపోతుంది. కానీ మారనిది పరమాత్మ ఒక్కడే. ఈ విషయం ఆయనే స్వయంగా బ్రహ్మదేవుడికి శబ్ద రూపంలో చెప్పడం జరిగింది.

పత్రి గారు కూడా “సత్యం” గురించి ఈ విధంగా చెప్పడం జరిగింది.

1. క్షణకాల సత్యం
2. జీవితకాల సత్యం
3. యుగకాల సత్యం
4. నిత్య సత్యం

అని నాలుగు రకాల సత్యాలు చెప్పడం జరిగింది.

1) క్షణకాల సత్యం అంటే ఈ క్షణంలో వుంటుంది, కానీ ఇంకొక క్షణానికి వుండదు. అంటే ఆ క్షణంలో వుండడం కరెక్టే కానీ, ఇంకొక క్షణంలో అది మారిపోతుంది. అందుకే దాన్ని క్షణకాల సత్యమన్నారు. అలా క్షణంలో మార్పు చెందేది “క్షణకాల సత్యం” అన్నారు.

2) జీవితకాల సత్యం అంటే సృష్టిలో వున్న 84 లక్షల జీవరాసులకు ఆయుష్షు వుంటుంది. ఆయుష్షు వున్నంత వరకు అవి వ్యక్తమవుతూనే వుంటాయి. ఎప్పుడైతే ఆ జీవి యొక్క ఆయుష్షు తీరిపోతుందో! ఆ జీవి అదృశ్యమైపోతుంది. ఇది జీవిత కాల సత్యం అన్నారు.

3) యుగకాల సత్యం అంటే ఈ యుగం అంతమైపోయినపుడు సమస్త జీవరాసితో సహా సమస్తం లయమైపోతుంది. దీనిని యుగకాల సత్యం అంటారు.

4) నిత్య సత్యం అంటే యుగాలు మారినా, కాలాలు మారినా, మార్పు చెందకుండా ఉండేది నిత్య సత్యం. అందుకే భగవంతుడు సృష్టికి పూర్వం నేనే ఉన్నాను, సృష్టి వున్నప్పుడు నేను వున్నాను. సృష్టి లయమైనప్పుడు నేను ఒక్కడినే

ఉంటాను అని బ్రహ్మ దేవుడికి "శబ్దమాత్రంగా" శ్రవణం ద్వారా వినిపించడం జరిగింది.

ఆయన ఇంకా "నేను లేనట్టుగాను వుంటాను", "వున్నట్టుగాను వుంటాను" అన్నారు. అంటే ఎవరికి లేనట్టుగా ఉంటాడు? ఒక అజ్ఞానికి లేనట్టుగానే వుంటాడు. అంటే శరీరం నశించిపోయాక, నేను లేను అని అనుకుంటాడు అజ్ఞాని.

కానీ "నేను ఉంటాను" అన్నారంటే జ్ఞానులకి అర్థమవుతుంది. జ్ఞానులు శరీరం వెళ్ళింది కానీ, ఆత్మ కాదు అని తెలుసుకుంటారు. ఆత్మే భగవంతుడు అని తెలిసిన జ్ఞానులకి నేను ఉన్నాను అని అనుకుంటారు. అందుకే నేను వున్నట్టుగా వుంటాను లేనట్టుగా వుంటాను అన్నారు.

అందుకే భగవంతుడు జ్ఞానులకి ఉన్నట్టుగా వుంటాడు, అజ్ఞానులకి లేనట్టుగా వుంటాడు. జ్ఞాని ఈ సృష్టి అంతా నా యందే ఉద్భవించింది అని విచారణతో తెలుసుకుంటాడు.

నేను లేనట్టుగా, వున్నట్టుగా అంటే ఉదా: మనం ఒక వృక్షాన్ని తీసుకుందాము. వృక్షం కొన్నాళ్లు పచ్చగా ఉంటుంది. ఆ తర్వాత ఎండిపోయి చచ్చిపోతుంది. అంటే చెట్టు చచ్చిపోయింది అని ఒక అజ్ఞాని అనుకుంటాడు కానీ ఒక జ్ఞాని దీనిలో ఆత్మ తప్పుకుంది అనుకుంటాడు. ఆత్మ వున్నప్పుడు పచ్చగా ఉంది, ఆత్మ లేనప్పుడు అది చచ్చిపోయింది అని ఒక "జ్ఞాని" తెలుసుకుంటాడు.

అందుకే "నేను ఉన్నట్టుగాను వుంటాను, లేనట్టుగాను వుంటాను". కానీ సృష్టి అంత నా వల్లే ఉద్భవిస్తూ ఉంటుంది అని "రెండో శ్లోకంలో" చక్కగా చెప్పాడు. ఇక్కడ అజ్ఞానులకి, జ్ఞానులకి ఏ విధంగా అనిపిస్తుందో! అది కూడా భగవంతుడు చెప్పడం జరిగింది.

ఈ సృష్టిలో ఎన్నో రకాల వస్తువులు వున్నాయి. పంచభూతాలు వున్నాయి, సమస్త జీవులు వున్నాయి. ఆయన ఇంకా ఏమన్నారంటే? అన్నిట్లో

ఇమిడి ఉన్నది "నేనే అయినా" ఎవరూ నా తత్వాన్ని గ్రహించలేరు అన్నారు.

సర్వభూతాలలోనూ ఆత్మ ఉన్నది అని గ్రహించడం చాలా కష్టమట. నేను ఎవరికీ కనిపించను, కనిపించకుండా సర్వ వస్తువులలోనూ, పంచ భూతాలలోనూ, సర్వత్ర నేను ఇమిడి ఉంటాను అని అన్నాడు.

చూడండి! ఆత్మ ఎవరికైనా కనిపిస్తుందా? కనిపించదు. అందుకే భగవంతుని చూపించు అంటారు! ఆత్మ కంటికి కనిపించేది కాదు, కానీ అన్నిట్లో ఇమిడి వుంది. ఆయన వున్నప్పుడే అన్నిటికీ చలనం వుంటుంది. ఇది జ్ఞానులకి మాత్రమే అర్థమవుతుంది.

అందుకే జ్ఞానం లేని వాడికి చెప్పడం కూడా దండగే. ఆ పరమాత్ముడే స్వయంగా ఇన్ని రకాలుగా చెప్పడం జరిగింది. ఆయన ఇంకా సృష్టిలో "సకల వస్తువుల యందు" "పంచభూతాల యందు", "అవ్యక్త రూపంలో" అంటే "వ్యక్తం కాని రూపంలో", అంతరంగా ఉంటాను, ఆత్మ రూపంగా నేను వుంటాను అని "మూడో శ్లోకంలో" చెప్పడం జరిగింది.

మరి ఇలా తన గురించి తాను 3 శ్లోకాలుగా చెప్పారు. దీన్ని బట్టి భగవంతుడు కనిపించాలి అంటే మూడో కన్ను వుండాలని అర్థం చేసుకోవాలి.

మరి "నాలుగో శ్లోకం" ద్వారా ఏం చెప్పాడు? "సర్వత్ర", "సర్వదా" అంటే "ఎప్పుడు", "ఎల్లప్పుడూ" "సర్వత్రా అన్ని చోట్ల ఉంటాను" అని చెప్పడం జరిగింది. కానీ ఎవరికి తెలుస్తుంది? అది "ఎరుక"లో వుండి మాయను జయిస్తే కానీ తెలియదు. మాయను జయించాలి అంటే? ఈ ప్రపంచం శాశ్వతం, ఈ శరీరం శాశ్వతం అనే మాయను జయించితే అన్నిటి ద్వారా, అన్నిటిని తెలుసుకోగలిగే శక్తిని పొందుతారు.

అంటే సర్వత్రా, సర్వదా ఉన్న నా అవ్యక్త రూపం మాయను జయించి ఆత్మే నేను, ''అన్నిటా, అంతటా'' ఉన్నవాడిని అని విచారణ ద్వారా తెలుసుకోవాలి. అంటే "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనే మాట దేనివల్ల తెలుస్తుంది అంటే విచారణ ద్వారా, మాయను జయించిన వాడికి మాత్రమే నేను

వ్యక్తమౌతాను అని "నాలుగో శ్లోకం"లో చెప్పడం జరిగింది, దీనిని బట్టి మనకి అర్థమయ్యేది సృష్టిలో అణువణువు ఆయనే నిండి వున్నాడు, సర్వజీవులలో ఆయనే వున్నాడు. పంచభూతాలలో ఆయనే ఉన్నాడు. ఈ సృష్టిలో కనిపించే ప్రతి దాని వెనకాల ఆ పరమాత్ముడు ఉన్నాడు. పరమాత్మ లేనిదే పరమ అణువు కూడా లేదు అనే సత్యాన్ని తెలుసుకున్నప్పుడు, సత్యం మీద ప్రీతి పెరుగుతుంది. ఆ ప్రీతి ఎప్పుడైతే మీకు ఉందో! ఆ భగవంతుడు వల్లే ఈ సృష్టి నడిపించ బడుతోంది, ఈ సకల చరాచర జగత్తు ఇంత స్పష్టంగా ఉంది అని తెలుసు కుంటారు.

చూడండి! ఎన్నో కోట్ల సంవత్సరాల నుండి ఈ నవగ్రహాలు, సూర్యుడి చుట్టూ ఒక దానికి ఒకటి ఢీ కొట్టుకోకుండా, యాక్సిడెంట్ అవ్వకుండా ఎంతో చక్కగా తిరిగేస్తున్నాయి. అంటే ఆయన సృష్టి ఎంత అద్భుతమో ఒక్కసారి ఆలోచించాలి.

మానవుడు కనిపెట్టిన విమానాలకు ఎన్ని యాక్సిడెంట్లు అవుతున్నాయో చూస్తే భగవంతుని సృష్టి ఎంత గొప్పదో అర్థమవుతుంది. మానవుడు ఏదైనా కనిపెట్టాడు అంటే మానవుని తెలివి, బుద్ధి కాదు, వాటిని పని చేయిస్తున్న 'ఆత్మే' కారణం. 'ఆత్మ' ఎంతో శక్తివంతమైనది. ప్రపంచానికి వీడి ద్వారా అందాలి అని పై లోకాలలోని వారు నిర్ణయించుకున్నప్పుడు, ఆత్మ ద్వారా వీడికి అందుతుంది. వీడి ద్వారా ప్రపంచానికి అందుతుంది.

చూడండి పత్రి గారిని తీసుకుంటే ఆయనలో ఉన్న ఆత్మ అందరికీ ధ్యానం నేర్పించాలి, అందరిచేత హింస మాన్పించాలి అనే ఒక సంకల్పం చేసుకొని భూమ్మీదకి వచ్చింది. అందుకే ఆయన అంత విశేషంగా కృషి చేస్తున్నారు.

అలాగే గొప్పవాళ్ళ ఆత్మలు గట్టి సంకల్పంతో పైనుండి క్రిందకు వస్తాయి. రావడమే కాదు, లోక కళ్యాణం కోసం విశేషంగా కృషి చేస్తారు కూడా!

ఒకవేళ అలా కాకుండా ఇంకొకటి చేస్తే వారికి తృప్తి వుండదు. అందుకే పత్రిగారు ఉద్యోగం చేసినన్నాళ్లు నా పని ఇది కాదు, ఇది కాదు, అనుకునేవారు. అందుకే  ఆయన ఉద్యోగానికి రిజైన్ చేసి ధ్యానము, ధ్యాన ప్రచారము చేస్తున్నప్పుడు ఆయన తృప్తిగా జీవించారు.

అంటే  పై లోకాల నుంచి వచ్చిన ఆత్మ ఏమి నిర్ణయం తీసుకుంటుందో! ఆ పని చేస్తేనే తృప్తిగా ఉంటుంది. ఈ రోజు మనందరము కూడా ఏ పని చేయాలని వచ్చామో! ఆ పని చేసినప్పుడు మాత్రమే మనకు తృప్తిగా ఉంటుంది, కాని ఆ పని చేయకపోతే తృప్తిగా ఉండదు.

అందుకే, ఆత్మ అంటే భగవంతుడు అందరిలో అంతర్యామిగా వుండి నేను ఎవరికీ వ్యక్తం కాను, మాయను జయించి సదా ఎరుకలో జీవించే వారికి మాత్రమే నేను వ్యక్తమవుతాను అని చాలా స్పష్టంగా చెప్పాడు.

భాగవతంలోని నాలుగు శ్లోకాల ద్వారా పరమాత్మ బ్రహ్మదేవునికి చెప్పడం జరిగింది.

అందుచేత ఆ "పరమాత్మ తత్వం" తెలుసుకోవాలంటే "భాగవతాన్ని" అధ్యయనం చెయ్యాలి అంటారు. పరమాత్మ తత్వం తెలిసినప్పుడు మనకి ఏమి అర్థమవుతుంది?

ఈ సృష్టిలో ఒక చీమ నుంచి అంటే అణువు నుంచి కూడా పరమాత్మ తత్వం తోటే అని అర్థమవుతుంది, ముందుకి సాగుతుంది. అందుకే 'సర్వం ఖల్విదం బ్రహ్మ!' అన్నారు. అందుకే విచారణ చేసుకుంటే నాదంటూ ఏమీ లేదు, మాదంటూ ఏదీ లేదు, అంతా నా చేత చేయించబడుతుంది, నా చేత చెప్పించబడుతుంది అని తెలుసుకున్నప్పుడు ఎవరికీ అహంకారం రాదు, వినయంతో జీవిస్తారు.

అందుచేత ఆ దైవం మీద ప్రతీ వున్నప్పుడే ఇవన్నీ తెలుసుకోవడానికి ఇష్టపడతాం. దైవమే లేదు అనే మూర్ఖుడికి ఎవరూ చెప్పలేరు. కానీ వాడు కూడా ఎన్నో జన్మలు తీసుకున్న తరువాతే తెలుసుకుంటాడు. అందుకే పత్రి

గారు ఎవరైనా వాడి ఆత్మ స్థితిని బట్టి వాడు చేసేది కరెక్టు అనుకుంటాడు.

అలా కొంత మంది 100 జన్మల్లో నేర్చుకుంటారు. కొంతమంది కొన్ని వందల జన్మలు తీసుకొని నేర్చుకుంటారు. ఎవరైనా చివరకు నేర్చుకోక తప్పదు. అలాంటి వారికి చెప్పటమే మన ధర్మం కానీ, ఆచరిస్తాడా? లేదా? అనేది మనకు అవసరం లేదు. కానీ, జ్ఞాన మార్గంలోకి వచ్చినప్పుడు తెలుసుకోవాల్సింది ఎంతో ఉందని తెలుసుకుంటాడు.

అందుకే ప్రీతి అంటే మన ఇష్టం దేని మీద వుండాలి? అంటే బాహ్యా వస్తువుల మీద, మోజు కలిగించే వస్తువుల మీద కాదు, ఆ భగవంతుడి తత్వం మీద వుండాలి. ఇది నువ్వు తెలుసుకుంటే, భగవంతుడు మీద తీవ్రాతి తీవ్రమైన ప్రీతి అంటే ఇష్టం నీకు వస్తుంది.

మానవుడు మాట్లాడుతున్నాడంటే శరీరంలో ఆత్మ ఉంటేనే. ఆత్మ అనే భగవంతుడు లేకపోతే ఎవరూ మాట్లాడలేరు, చూడలేరు. వినలేరు, వాసన చూడలేరు, ఏ పని చేయలేరు. ఈరోజు ఎవరైనా ఏదైనా గొప్ప కార్యము చేయగలుగుతున్నారు అంటే "ఆత్మ అనే భగవంతుడు" వారి దేహంలో వున్నాడు కాబట్టే!

అందుచేత అనుక్షణం ప్రతి దాని వెనకాల ఆ భగవంతుని తత్వమే వుందని తెలుసుకోగలిగితే, మాయను జయిస్తారు. కారణం ఈ సృష్టిని సృష్టి చేసిన ఆ పరమాత్మ, "మాయను" కూడా తన చేతిలోనే వుంచుకున్నాడట. తనని మర్చిపోయిన వాడిని "మాయకు" వశం చేస్తాడు. తనకోసం తపించే వారికి ఆ "మాయ" లేకుండా తన దగ్గరకు వచ్చే మార్గాన్ని తెలియపరుస్తాడు. అందుకే మనకి దేని మీద ప్రీతి ఉండాలంటే, భగవంతుని మీద ప్రీతి వుండాలి అని తెలుసుకోవాలి.

2. సత్యం అంటే భగవంతుడు అని చెప్పుకున్నాము. అదే ఆత్మ, అదే పరమాత్మ. ధర్మం అన్నది భగవంతుని చేత ఏర్పరచబడింది. అందుచేత ఎవరైతే ధర్మాన్ని ఆచరిస్తారో, ఆ ధర్మమే వారిని కాపాడుతుంది అని అంటారు.

మామూలుగా యోగులందరూ ధర్మాన్ని "గోవు స్వరూపంగా" చెప్పారట. అంటే ఆవుకున్న నాలుగు కాళ్లు, నాలుగు విధాల ధర్మాన్ని సూచించారు. ముందు రెండు కాళ్లు తపస్సు, పవిత్రత. వెనకాల రెండు కాళ్లు దయ, దానము అన్నారు. ఈ నాలుగు ఆచరించిన వారు ధర్మాన్ని ఆచరించినట్లే అని చెప్తారు.

తపస్సు అంటే అన్నిటిని తగ్గించుకోవడం. అలా కోరికలు తగ్గించుకుంటూ, వాళ్ళ అవసరాలు, మాటలు తగ్గించుకుంటూ, అక్కరలేని వ్యవహారాలు తగ్గించుకుంటూ, ధ్యానంలో వుంటే తపస్సు ఆచరిస్తున్నట్టే!

మానవ జన్మ యొక్క ముఖ్య ధర్మం తపస్సే, అంటే ధ్యానమే! ఆ ధ్యానమే లేకపోతే మానవుడు మాయను జయించే అవకాశం లేదు. మాయను జయించాలంటే ధ్యానం చేయాల్సిందే, యోగంలో ఉండాల్సిందే! యోగం వల్ల మాత్రమే మీ మనసు, బుద్ధి శుద్ధత్వం పొందుతాయి!

ఎంతవరకు మాయలో వుంటారో అంతవరకు ఈ ప్రపంచం శాశ్వతం అనుకుంటారు, ఈ శరీరం శాశ్వతం అనుకుంటారు, ఈ బంధువులు శాశ్వతం అనుకుంటారు. సత్యాన్ని ఎప్పుడైతే తెలుసుకుంటారో, ఆ మాయ నుంచి బయట పడతారు., అప్పుడు ఇవన్నీ వచ్చే, పోయే చుట్టాలాంటివి. ఏది శాశ్వతం కాదని తెలుసుకుంటారు.

ఈ ఆత్మ మధ్య మధ్యలో ఈ భూలోకానికి వచ్చి, శరీరాన్ని తీసుకుని అనుభవాలు నేర్చుకొని వెళ్లడానికే, అనేది "ధ్యానం ద్వారా" మాత్రమే తెలుసుకోగలరు.

సత్శీలం అంటే మరి మన బిడ్డని ఎంతగా ప్రేమించగలమో, ప్రక్క పిల్లవాడిని కూడా ప్రేమించాలి. అంతేకాదు ఎదుటివాడిది ఎప్పుడూ కూడా అయాచితంగా మనకి రావాలి అని అనుకోకూడదు. ఎంత కష్టమైనా నిజమే మాట్లాడాలి, కానీ అబద్ధం ఎప్పుడూ చెప్పకూడదు. అలాగే మనకి లేకపోతే పస్తు అయినా ఉండాలి కానీ దొంగతనం చేయకూడదు. మరి ఈనాటికి హరిశ్చంద్రుడిని చెప్పుకుంటున్నారు అంటే మరి ఆయన నోటి వెంట ఎప్పుడు

అబద్ధం రాలేదు.ఎన్ని కష్టాలైనా సహించాడు, భరించాడు. ఆయన అదృష్టం ఏమిటంటే ఆయన భార్య కూడా అంత అనుకూలవతి అయ్యింది. ఆయన సత్యానికి కట్టుబడ్డాడు. ఎన్నో కష్టాల అనుభవించాడు. విశ్వామిత్ర మహర్షి పరీక్షించడానికి ఎన్నో కష్టాలు కలిగించాడు. భార్య వెళ్ళిపోయింది, బిడ్డ కళ్ళ ముందు చచ్చిపడి వున్నాడు. కానీ హరిశ్చంద్రుడు తన ధర్మాన్ని నెరవేర్చాడే కానీ అబద్ధం ఆడలేదు.

అందుకే, ఇన్ని యుగాలు మారినా "సత్య హరిశ్చంద్రుడు" అని చెప్పుకుంటారు. అంటే ఒక మాట నోటి వెంట వస్తే అది ఎంత ప్రమాదం అవుతుందో మరి అలాంటి సత్యానికి కట్టుబడి ఉంటే ఎంత గొప్పగా బ్రతకచ్చో అనేది సత్య హరిశ్చంద్రుని చూసి నేర్చుకోవచ్చు.

సత్శీలం అంటే పంచ మహాపాపాలు అంటే దొంగతనము, జూదము, వ్యభిచారము, హింస, అసత్యము ఇవన్నీ లేకుండా ఉండడమే సత్శీలము అని చెబుతారు. ముఖ్యంగా మానవుడి యొక్క ముఖ్య ధర్మం ధ్యానం చేయడం, రెండవది సత్శీలము, మూడవది దయ.

ఈ దయ నీ క్రింది వారి మీద చూపించాలి. నీ క్రింది వారి మీద నువ్వు దయ చూపిస్తే, నీ పై వాడు, నీ మీద దయ చూపిస్తాడు. అందుకే స్వామి వివేకానంద అనేవాడు పేదవాళ్ల కన్నీళ్లు ధనవంతుడు తుడిస్తే, ధనవంతుడి కన్నీళ్లు ఆ దైవం తుడుస్తాడు అని. అందుచేత ఎప్పుడు కూడా మన క్రింద వాళ్లను దయతో చూడాలి. అందుచేత సాటి మానవులు మీద మాత్రమే దయ చూపించడం కాదు, అన్ని జీవుల మీద కూడా దయ చూపించాలి. కారణం దైవానికి అందరూ ఒక్కటే! అంతా సమానమే కాబట్టి.

చాలామంది అన్నదానాలు, వస్త్రదానాలు, అన్న సంతర్పణలకి డబ్బులు ఇవ్వడం చూస్తున్నాం. అన్నం పెట్టడం మంచిదే. కానీ, మాంసాహార భోజనం పెడితే, అది అన్నం పెట్టినట్టు కాదు, ఒక రక్తపు కూడు, పాపపు కూడు వాళ్ళ చేత తినిపించినట్లే! అంటే ఎంత అజ్ఞానం? మాంసం కూర వేసి వాడికి అన్నం

పెడుతున్నారంటే అది పుణ్యం కాదు, అంతులేని పాపం చేస్తున్నట్టే!

డాక్టర్స్ కూడా మాంసం తింటే శరీరానికి బలం వస్తుంది అని మాంసం తినమని ప్రోత్సహిస్తున్నారంటే, వారు ఎంత పాపం చేస్తున్నారో కూడా తెలియనంత అజ్ఞానంలో ఉన్నారు. మాంసపు కూడు పెడితే, సాటి జీవుల మీద దయ లేనట్టే.

ఎన్ని దానాలు చేసినా మాంసాహారపు భోజనం పెట్టావంటే, నీ ఖాతాలోకి పుణ్యం కంటే పాపమే ఎక్కువ చేరుకుంటుంది.

అలాగే, ప్రతి జీవిని స్వేచ్ఛగా బతకనివ్వడం దయ. ఎవరి స్వేచ్ఛకి భంగం కలిగించకూడదు. అప్పుడు నువ్వు అందరి మీద దయ చూపించినట్టు అవుతుంది. కొంతమంది చేపలని ఆక్వేరియంలో పెట్టి పెంచుతుంటారు. కొంతమంది కుక్కలని, పిల్లులను, పక్షులను పెంచుతుంటారు. కానీ ఇవన్నీ కూడా వాటి స్వేచ్ఛను హరించడం.

దయ అంటే ప్రతి జీవి మీద జాలి చూపించడమే. పెద్దవారు దానం గురించి ఒక మాట చెప్పేవారు నువ్వు వంద రూపాయలు సంపాదిస్తే, పది రూపాయలు దానం చేయి. 90 రూపాయలు నీ కోసం ఖర్చు పెట్టుకో! కానీ, నువ్వు ఖర్చు పెట్టుకున్నది మట్టి పాలు. ప్రక్క వాడికి పెట్టింది నీ పాలు అని తెలుసుకోమని చెప్పేవారు. ఎందుచేతనంటే ప్రక్క వాడికి ఇచ్చిన పది రూపాయలు పుణ్యం నీ ఖాతాలోకి వెళ్తుంది.

అందుకే, దానం కూడా ధర్మంలో ఒక భాగం అని తెలుసుకోవాలి. భగవంతుడు ఏర్పరిచిన ధర్మాలలో ఆఖరి ధర్మమేమిటంటే? దానము. నీకు వున్నదాంట్లో కొంతైనా పంచాలి, ఎందుకంటే? భగవంతుడు నువ్వు ఒక్కడివే అనుభవించడం కోసం కాదు, ప్రతి వాళ్ళకి ఇస్తున్నావా? లేదా? అని చూస్తాడు.

విచిత్రం ఏంటంటే ? ఇవ్వగలగిన వాళ్ళకి ఆ దాన గుణం వుందా? లేదా? అని మీ చుట్టూ ఇలాంటి వాళ్ళనే క్రియేట్ చేస్తాడట భగవంతుడు. అంటే ఆకలిగా వున్నవారు కానీ, ఏమీ లేని వాడు కానీ నీకు తారసపడతారు.

నువ్వు పెట్టగలవా? లేదా? దయ చూపించగలవా? లేదా? అనేది సహజంగానే చూడబడతాయి.

భగవంతుని ధ్యానం అంటే తపస్సు అని తెలుసుకోవాలి. ఇది తెలుసుకోవడానికే! రెండోది పవిత్రత. భగవంతుని దగ్గరకు రావాలంటే పవిత్రంగా వుంటేనే ధ్యానం కుదురుతుంది, కాబట్టి పవిత్రంగా వుండాలి. చూడండి, విగ్రహానికి పూజ చేసినపుడు ఎంతో మడిగా, ఎంతో శుభ్రంగా పవిత్రంగా వుంటారు. కానీ మనస్సుని పవిత్రం చేసుకోరు. కానీ ముఖ్యంగా కావాల్సింది అదే! కారణం భగవంతుడు “బాహ్య ప్రియుడు” కాదు “భావ ప్రియుడు”. ఇది తెలుసుకుంటే మనస్సుని కూడా పవిత్రంగా వుంచుకుంటారు.

అంటే మొదటిది ధ్యానము, రెండవది సత్శీలము అంటే పవిత్రత, మూడవది దయ, నాలుగోవది దానము. ఈ నాలుగు వుంటేనే ధర్మాన్ని ఆచరించినట్టు. అందుకే ధర్మాన్ని “గో” స్వరూపంగా చెప్పి, ఆ నాలుగు కాళు ్లు ఇవే అన్నారు.

అందుచేత భగవంతుని మీద అంటే సత్యం మీద ప్రీతి ఉండాలి. ఆయన ఏర్పరచిన ధర్మాన్ని ఆచరించడంలో ప్రీతి ఉండాలి. అందుకే “సత్యము, ధర్మము” రెండిటి మీద ప్రీతి ఉండాలి అని తెలుసుకోండి.

సత్యము అంటే భగవంతుడే. ఎక్కడ ఉంటాడు? అంటే ఆయన “లేనిది లేదు” ఆయన అన్నిటా, అంతటా ఉంటాడు. అందుకే “సర్వం ఖల్విదం బ్రహ్మ” అన్నారు. భాగవతం చదివితే సృష్టి గురించి, సృష్టి నియమాలు గురించి తెలుస్తాయి. అందుకే పత్రి గారు పదేపదే స్వాధ్యాయం చెయ్యండి అని చెప్పడానికి కారణం.

ఈ భగవత్తత్వాన్ని బ్రహ్మదేవుడికి మొట్టమొదటగా ఆ పరమాత్ముడే శబ్ద రూపంలో వినిపించాడు కాబట్టి వీటిని శృతులు అన్నారు. ఆ “శృతులు”, శ్రవణం ద్వారా విన్నాడు కాబట్టి జ్ఞానాన్ని శృతులు అన్నారు.

తర్వాత వ్యాసులవారు నాలుగు వేదాలుగా విభజించి “ఈ మంత్ర

భాగం", "తంత్ర భాగం" అన్నీ కూడా మనకి చెప్పడం జరిగింది.

మానవులు ఏమీ చదవరు, తెలుసుకోరు కాబట్టి సృష్టిలో రహస్యాలు ఏమి తెలియవు. బ్రహ్మదేవుడు తర్వాత వీటిని "నారద మహర్షికి" తెలియజేశాడట. బ్రహ్మ నుంచి ఈ భగవత్తత్వం గురించి నారదుల వారికి తెలిసింది. నారదుడు "వ్యాసుల" వారి ద్వారా దీన్ని గ్రంథ రచన చేయించడం జరిగింది. అంటే వేదాలు విడదీయడం కాదు, భాగవతం మొత్తం మరల వ్యాసుడే రాశాడు. ఆ వ్యాసుడు "శుక మహర్షికి" చెప్పడం జరిగింది. శుక మహర్షి "పరీక్షిత్ మహారాజుకి" చెప్పడం జరిగింది. ఇలా పరంపరగా వచ్చింది.

అయితే ఈ భాగవత తత్వాన్ని, ఈ భాగవతాన్ని ప్రచారం చేసిన వాళ్లు కూడా ఉన్నారు. ఆదిశేషుడు, పాతాళ లోకంలో ప్రచారం చేశాడట, ఈ భాగవత తత్వాన్ని దేవతలకి గురువైన "బృహస్పతి" దేవలోకంలో ప్రచారం చేయడం జరిగింది. "పరాశర మహర్షి", భూలోకంలో ప్రచారం చేశాడు. అందుకే, పరాశర మహర్షి యొక్క ధర్మమే ఈ కలియుగంలో ఉంది అని చెప్పుకుంటారు.

మరి సనకసనందనాదులు నలుగురు మిగిలిన లోకాలలో ఈ భాగవత తత్వాన్ని అంటే "భగవంతుని తత్వాన్ని" తెలియ చేశారు. అదే "భాగవతం". దాన్నే "భక్తి జ్ఞాన వైరాగ్యాలతో" కూడిన కథలు అని చెప్తుంటారు. భాగవతం అంటే ఆత్మ తత్వం. ఇలా ప్రచారం జరిగి మొత్తం అందరికీ అందుబాటులోకి వచ్చింది.

అందుకే సత్యం, ధర్మం మీద ప్రీతి వుండాలి అని చెప్పడం జరిగింది. అందుచేత భాగవతంలో చెప్పింది ఆచరించి మాయని జయించి సదా ఎరుకలో వుంటూ సాధన చేస్తుంటే! ఇంకా ఇంకా ఈ జ్ఞానమును పెంచుకున్న వాళ్ళమవుతాము.

# భీతి

భీతి అంటే భయం. దేని మీద భయం వుండాలి? అంటే పాపకర్మలు చేసేటప్పుడు భయం ఉండాలి, హింస చేసేటప్పుడు భయం వుండాలి. ఎవరికైనా పాపకర్మలు అనుభవించేటప్పుడు ఎంత ఘోరంగా ఉంటుందో తెలుసుకుంటే అప్పుడు 'భీతి' ఉంటుంది.

అందుకే అహింసలో జీవించే వాళ్ళు నిర్భయంగా ఉంటారు. హింసలో జీవించే వాళ్ళు భయంతో వుంటారు. 'పాప భీతి' వున్నవారు హింసే చెయ్యరు. మరి హింస ఎందుకు చేస్తున్నారు? ఈ హింస రాగద్వేషాల వల్ల చేస్తున్నారు, చెడ్డ కోరికల వల్ల హింస చేస్తున్నారు. చాలా మంది మాంసం తినాలనే కోరిక వల్ల హింస చేస్తున్నారు.

ఈ కోరికలు, హింసలలో కూడా చాలా రకాలు వున్నాయి. హత్య చేయడం హింస, ఏడిపించడం హింస, ఒకరి స్వేచ్ఛను అడ్డుకోవడం హింస, ఇలాంటి హింసలు కూడా వున్నాయి.

ఇలాంటి హింసలు చేయడానికి బుద్ధుడు నాలుగు కారణాలు చెప్పాడు, అవి

1. అహంకారం
2. మాయ
3. కోపం
4. లోభం

ఈ నాలుగు కారణాలవల్లే హింస ఎక్కువగా జరుగుతుంది అని బుద్ధుడు చెప్పాడు.

**1) అహంకారం :-** ఈ అహంకారం వల్ల నేను ఏం చేసినా చెల్లుతుంది హింస చేస్తారు. చూడండి దుర్యోధనుడు, రాజ్యం తనది కాదు అని తెలుసు,

కానీ అహంకారం వల్ల యుద్ధంలో వచ్చే పరిణామాలు ఎలా వుంటాయో శ్రీకృష్ణుడు వివరించి చెప్పినా సరే వినలేదు. ఎందుకంటే? నా వెనకాల ఇంత మంది ఉన్నారు అనే ఒక అహంకారంతో అలా చేశాడు.

అలాగే రావణాసురుడు అహంకారం వల్లే ఆ యుద్ధాన్ని ప్రేరేపించాడు. విభీషణుడు అన్నయ్య నువ్వు తప్పు పని చేస్తున్నావు ఇప్పటికైనా సీతమ్మను తీసుకువెళ్లి రాముడికి అప్పచెప్పి క్షమించమని అడిగితే, రాముడు నిన్ను తప్పకుండా క్షమిస్తాడు, దానికి ఇంత యుద్ధం అవసరం లేదు అని చెప్పినా, అహంకారం వల్ల వినలేదు. యుద్ధం చేయటం కూడా ఒక హింసాత్మకమైన చర్య కాబట్టి వాళ్లు హింసకే మొగ్గు చూపారు. ఇలాంటి అహంకారాలు అప్పుడే కాదు ఇప్పుడు కూడా ఉన్నాయి.

ఇప్పుడు జరిగే యుద్ధాలు చూస్తే ఆధిపత్యం కోసం ఎన్నో యుద్ధాలు జరుగుతున్నాయి? మరి గోకుల్ చాట్ అని హైదరాబాదులో ఒకచోట బాంబు వేసి ఎంతోమంది పిల్లలు, పెద్దలు చనిపోవటానికి కారణమయ్యారు. ఇంతమందిని చంపగలిగే మనస్తత్వం ఉంది అంటే ఎలాంటి రాక్షస మనస్తత్వంమో తెలుసుకోండి. అందుచేత అహంకారపూరితమైన మనసు కొద్దిగా ఉంటే వాడి చుట్టూ ఉన్న వాళ్ళకి నష్టం. అది మితిమీరి ఉంటే వినాశనం ఎక్కువ చేస్తారు, ఎక్కువ జననష్టం కలిగిస్తారు

**2) మాయ:–** మాయ అంటే వున్నట్టుగా వుంటుంది కానీ వుండదు. ఈ దేహం నేను అని అనుకోవటం మాయ, కారణం కొన్నాళ్ళకు దేహం వుండదు. జ్ఞాని ఈ ప్రపంచం శాశ్వతం కాదు, ఈ ప్రపంచంలో వున్నవి శాశ్వతం కాదు, ఈ దేహం శాశ్వతం కాదు అని తెలుసుకుంటాడు.

కానీ మాయకు వశమై ఈ స్థలం నాది, ఈ పొలం నాది, ఈ ఇల్లు నాది, ఈ ఆస్తి నాది, నేనే శాశ్వతంగా ఉండిపోతాను అన్నట్టు నాది, నాది అని అనుకుంటే మాయలో పడినట్టే.

**3) కోపం :-** ఈ కోపం వల్లే కక్ష కడతాడు. హింస చేస్తాడు. కోపం ఎందుకు అంటే? వాడు అంటే నాకు పడదు అని కోపం. చూడండి పాకిస్తాన్, ఇండియా గొడవ జరిగింది. కారణం ఒకరి మీద ఒకరికి కోపం. దాని వలన ఎంతమంది హింసకు గురి అవుతున్నారు?

కానీ ఈ హింసకు కారణం మాంసాహారమే. అందుకే పత్రి గారు మొదటినుంచి మాంసాహారం వద్దు అంటారు. హింసతో కూడుకున్న ఆహారం వద్దు, రక్తపు కూడు వద్దు అని పదేపదే చెప్పడానికి కారణం అదే. మాంసాహారం క్రోధాన్ని పెంచుతుంది. కారణం రజోగుణమైన ఆహారం కాబట్టి.

4) లోభము :- లోభము అంటే పిసినారితనము. తనది ఒక్క పైసా ఎదుటివాడికి ఇవ్వటానికి ఒప్పుకోడు.ఆ లోభత్వం వల్లే కొన్నిచోట్ల హింస జరుగుతుంది.

అందుకే బుద్ధుడు ఈ నాలుగు కారణాల వల్లే ప్రతి మనిషి హింస చేస్తున్నాడు అన్నాడు. పూర్వం యాగాలలో జంతు బలులు ఇచ్చేవారట. ఒకసారి బింబిసారుడు పెద్ద యాగం చేశాడట. చేస్తూ వుంటే కొన్ని పశువుల్ని తీసుకు వెళ్తున్నారట. అప్పుడు బుద్ధుడు వారిని అడిగాడట. ఈ పశువులన్నీ ఎక్కడికి తీసుకు వెళ్తున్నారు? అని. అప్పుడు వారు బింబిసార మహారాజు గారు పెద్ద యాగం చేస్తున్నారు. ఆ యాగంలో రాజుగారు క్షేమంగా వుండాలని ఈ పశు వులను బలి ఇవ్వడానికి తీసుక వెళ్తున్నాము అని వారు చెప్పినప్పుడు బుద్ధుడు సరే పదండి అని వాళ్ళతో ఆయన కూడా వెళ్తాడు.

అక్కడ బలి ఇవ్వబోతూ వుంటే రాజు గారితో మీరు బలి ఎందుకు ఇవ్వాలి? అని అడిగాడు బుద్ధుడు. అప్పుడు రాజు గారు దేవతలు తృప్తిపడతారు, దేవతలు తృప్తి పడితే, మనం అడిగినవన్నీ ఇస్తారు. అందుకే మేం బలి ఇస్తాము అని చెప్పినప్పుడు, బుద్ధుడు అన్నాడట రక్తం, మాంసం బలి కోరే వాళ్ళు దేవతలు ఎలా అవుతారు? వాళ్లు దేవతలే కాదు. అలాంటి బలి కోరే వారి

దయ వల్ల వచ్చే క్షేమం నీకేమి లాభం వస్తుంది? అని బింబిసారుడికి నచ్చచెప్పి, పోనీ నీకు బలి ఇవ్వాలని వుంటే ముందు నన్ను బలి ఇవ్వు అని చెప్పి అడ్డంగా వెళ్ళాడట.

అప్పుడు బింబిసారుడు బలి ఇవ్వడం మానేశాడట. బుద్ధుడు చేసిన బోధతో ప్రభావితమై బింబిసారుడు బౌద్ధ భిక్షువుగా మారిపోయాడట. దీని అర్థం బుద్ధునికి అంతటి శక్తి వుందని తెలుసుకోవచ్చు. ఒక్క మాటలోనే అవతల వారిని మార్చే శక్తి బుద్ధుడికి వుంది కాబట్టే బింబిసారుని యాగంలో బలులు మాన్పించగలిగాడు.

అలాగే బుద్ధుడు ఎన్నో చోట్ల యజ్ఞ యాగాదులలో బలులు మాన్పించడమే కాదు, జీవహింసని కూడా ఆపేవాడు. మనుషుల కోరికలు తీర్చుకోవడానికి హింసతో వచ్చే లాభంతో మనిషి ఏనాడు సుఖపడడు అని బుద్ధుడు బోధించే వాడు. ఆయన ఏమనేవారంటే ఎవరైతే హింసతో ఉంటారో వారి జీవితం ఎప్పుడూ వేదనతో, దుఃఖంతో, బాధతోనే ఉంటుంది అనేవాడట.

పాప భీతి ఉన్నవాడు ఎప్పుడూ జీవహింసే కాదు, ఎటువంటి హింస చెయ్యడు, ఎవరినీ ఏ రకంగానూ హింసించడు. అహింస మార్గంలోనే వుంటాడు. అహింసనే ప్రోత్సహిస్తాడు. బుద్ధుడు అందరికీ అహింస గురించి పదే పదే బోధించేవాడు. అందుకే బుద్ధుని గురించి అంత గొప్పగా చెప్పుకోవడం జరిగింది. అంటే బుద్ధుడి టైంలోనే జంతుబలులు ఆపడం జరిగిందని మనం తెలుసు కోవచ్చు.

అయితే ఈ హింస రెండు రకాలుగా వుంటుంది. 1) భావనా హింస, 2) కర్మయుత హింస.

భావనా హింస అంటే ఆలోచనలు హింసతో కూడి వుండటం అంటే ఒక హింస చేయాలని ప్లాన్ చేసుకుంటారు. చూడండి గోకుల్ ఛాట్‌లో బాంబు వేశారు అంటే వారు ఊరికే చేయలేదు. వారు ముందు ఎంతో ప్లాన్

వేసుకుంటారు. జనం ఎప్పుడు వుంటారు? ఎప్పుడు వస్తారు? మధ్యాహ్నం వుంటారా? పొద్దున వుంటారా? రాత్రికి వుంటారా? ఏ టైమ్‌లో ఎక్కువ వుంటారు? ఆదివారం వుంటారా? అని ముందు నుంచి ప్లాన్ చేసుకుని అప్పుడు బాంబు వేస్తారు. అంటే వాళ్ళలో హింస చేయాలి? అనే ఆలోచన, అనే భావం తరువాత కర్మగా మారుతుంది.

అంటే కొంతమంది హింసాత్మకంగా ఆలోచిస్తారు. కొంతమంది అది కర్మగా ఆచరణలో పెడతారు. అంటే కొంతమంది ఆలోచనలో హింస వుంటుంది. కొంతమందికి చేతలలో హింస వుంటుంది. అంటే చేసిన కర్మ హింసగా కనబడుతుంది, కానీ ఆలోచనలలో వున్న హింస కనబడదు. కానీ చేసిన వాడికి ఎంత శిక్ష పడుతుందో ఆలోచించి చేసిన, చేయించిన వాడికి కూడా శిక్ష వుంటుంది. ఎవరైనా సరే ఒక తప్పు చేస్తున్నారు అంటే వాడికి ఆధ్యాత్మికత అర్థం కాలేదు, వాడు ఆధ్యాత్మికతలోకి రాలేదు అని తెలుసుకోవాలి. నిజంగా ఆధ్యాత్మికతలోకి వస్తే, కర్మ సిద్ధాంతం తెలుసుకుంటే కష్టాలకి, దుఃఖానికి కారణం తెలుస్తుంది. అప్పుడు హింసకు కారణమైన మాంసాహారం మానేస్తారు అంటే వాళ్ళు కర్మ సిద్ధాంతం నేర్చుకున్నారు కాబట్టి! పత్రిగారు చెప్పారు కదా!

పెద్దపెద్ద పాపాలే పెద్ద పెద్ద రోగాలు!

చిన్న చిన్న పాపాలే చిన్న చిన్న రోగాలు!

పాపాలే లేకపోతే రోగాలే లేవు అని మూడు ముక్కల్లో కర్మ సిద్ధాంతాన్ని ఆయన నేర్పడం జరిగింది.

ఈ బాధలు, రోగాలు, కష్టాలు అనుభవించి, అనుభవించి అవన్నీ పోగొట్టుకుందాము అని పత్రిగారి వద్దకు వచ్చినప్పుడు ఆయన ముందు హింసను మానండి, మాంసాహారం మానండి అంటారు.

ఇప్పుడు అందరికీ భవరోగం ఉంది. ఈ భవరోగం తగ్గాలి అంటే ముందు హింస మానాలి, 'శ్వాస మీద ధ్యాస' ధ్యానం చెయ్యాలి. కొంతమంది చేపలు

తింటారు, వాళ్ళు తిన్నారు, వీళ్ళు తిన్నారు అని చెప్తారు. కానీ ఏ ఆహారం తీసుకుంటావో! నీకు అలాంటి ఆలోచనలే వస్తాయి కాబట్టి ముందు మాంసాహారాన్ని మానాలని చెపుతారు.

పత్రిగారు భావనయుతమైన హింస, కర్మతో చేసే హింస రెండూ వద్దంటారు. చూడండి కోడికూర తినాలి అన్న ఆలోచన నీకు వస్తే, అది భావంతో చేసే హింస. వెంటనే కోడిని కోసేసుకుని తింటావు. అప్పుడు అది పాప కర్మతో చేసిన అవుతుంది. ఒకవేళ కోడిని వండి పెట్టినా అది ఇంకొక కర్మ అవుతుంది.

అందుకే జీసస్ క్రైస్ట్ ఏమంటారంటే నోట్లో నుంచి వచ్చే మాటలు కంటే నోట్లోకి వెళ్లే ఆహారమే ప్రమాదకరమైనదని అంటారు. నీ నోట్లోంచి వచ్చే మాటలు అంటే ఎవరినైనా దూషించినా, తిట్టినా అది కూడా పాపమే అవుతుంది. కానీ నోట్లోకి వెళ్ళే మాంసాహారం ఘోరమైన పాపం అవుతుంది.

పత్రి గారు చెప్పినంత గట్టిగా, మాంసాహారం గురించి ప్రవచనాలు చెప్పే వారు చెప్పకపోవడం వల్ల  జనానికి హింస గురించి అర్థం కావట్లేదు. కానీ ఈ బాధలకి, కష్టాలకి, కన్నీళ్ళకి కారణం జీవుల్ని చంపడమే కారణమని తెలుసుకోవాలి. ఎందుకంటే? ప్రతీ ప్రాణిలో కూడా దైవం ఉంది, దైవాన్ని హింసించడం పాపం కాకపోతే మరేమిటి?

అందుచేత ఈ హింస చేసిన వాళ్లని అంటే మాంసాహారం తినే వాళ్ళని సమర్థించినా పాపమే! మాంసం మానేయాలి అని చెప్పాలి అంతే కానీ మెల్లిగా మాను అని చెప్పకూడదు. మనస్మృతిలో మాంసం వండేవాడు, వడ్డించేవాడు, అమ్మేవాడు, కొనేవాడు, తినేవాడు, సమర్థించిన వాడికి కూడా పాపం అంటుకుంటుంది అని చెప్పడం జరిగింది.

కొంతమంది ధ్యానం చేయిస్తే మెల్లగా వాళ్లే మానేస్తారని అంటారు. కానీ ధర్మం తెలుసున్నాక  ధర్మాన్ని ధైర్యంగా చెప్పకపోవడం కూడా తప్పే.

ఎందుకంటే కొంతమంది వాడు మెల్లిగా మారతాడు అంటారు. కానీ వాడు మారేలోగా ఎన్ని జీవుల్ని చంపుతాడు? ఒక మనిషిని చంపితే ఎలా పాపమో, ఒక చేపని చంపినా, అలాగే ఒక రొయ్యని చంపినా, కోడిని, మేకని చంపినా అంతే పాపం. చూడండి ఒక మనిషి ఇంట్లో చచ్చిపోతే ఎన్ని రోజులు ఏడుస్తారు?

కానీ ఒక కోడిని హింసించి, చంపితే అది ఎంత బాధపడుతుంది? భయపడుతుంది. మన ప్రాణం లాంటి ప్రాణమే కదా దాని ప్రాణం కూడా!

అందుకనే పత్రి గారు ముందు మాంసం మానండి తర్వాతే ధ్యానం అంటారు. ఎందుకంటే హింస పెరగడం వల్లే ప్రపంచంలో ఇన్ని ఉపద్రవాలు వస్తున్నాయి.

జంతువులను, పక్షులను, జలచరాలను చంపడానికి వెనుకాడట్లేదంటే మానవులకు పాపభీతి లేదనే లెఖ. పాపభీతి లేదు కాబట్టే మానవులు జీవులను చంపుతూ భయపెడుతున్నారు. అందుకే భగవంతుడు కరోనాతో జనాలను అంతలా భయపెట్టాడు.

నీకు బుద్ధి ఇచ్చి, వాటిని ఉపయోగించి హాయిగా బ్రతకమని ఆహారం, నీరు, పళ్ళు, కూరగాయలు అన్నీ ఇస్తే, శాకాహారం మానేసి హింస చేస్తే భగవంతుడు ఊరుకుంటాడా?

అందుకే అంటారు ఏ చేతితో కత్తి పట్టుకుంటావో, ఆ చెయ్యే శిక్షను అనుభవించాలి అని చెప్తారు బుద్ధుడు. అందుకే "పాపం చేసేటప్పుడు సుఖభ్రాంతి వుంటుంది, కానీ ఆ పాపానికి ఫలితం అనుభవించేటప్పుడు జీవితం కడు దుర్భరంగా వుంటుందని బుద్ధుడు చెప్పారు.

జీవితంలో సుఖ, భోగాల వెనకాల పరిగెడితే నువ్వు మాయలో వున్నట్టే. అప్పుడు ఇంకా ఇంకా క్రిందకి కురుకు పోతావు. ఆ మాయని జయించాలి అంటే ధ్యానం చేయాలి. ఎవరి జీవితంలోనైనా దుఃఖం ఉంది అంటే నేను ఎంతో పాపం చేశాను! ఎన్నో జీవులని కష్టపెట్టాను! ఎంతోమందిని కష్టపెట్టాను!

అని తెలుసుకోవాలి.

దేవుళ్ళని మార్చేవాడు, దేవుడు మీద భారం వేసేవాడు, దేవుడి గురించి తెలియదనే తెలుసుకోవాలి. దేవుడి గురించి తెలుసుకుంటే పాపం చేసేటప్పుడు, హింస చేసేటప్పుడు పాప భీతి వుంటుంది. ఆ భీతి వుంటే హింస చేయరు.

ఒక మనిషిలో ఏ ఆత్మ వుందో! అదే ప్రతీ జీవిలో వుంది. సృష్టిలో 84 లక్షల జీవరాశులలో మానవుడిలో వున్న ఆత్మే వుంది అని తెలుసుకున్నవాడు హింస చేయడు. అందుకే ఆధ్యాత్మిక విద్య చిన్నప్పటి నుంచే నేర్పాలి అని పెద్దలు చెపువారు. దురదృష్టవశాత్తూ ఈ కలియుగం వచ్చేటప్పటికి ఈ ఆధ్యాత్మిక విద్య అంతమైపోయి ప్రతీది దైవాన్ని అడుక్కునే విద్య వచ్చింది. కారణం భగవంతుడు ఎవరో! ఎక్కడున్నాడో తెలియట్లేదు.

ఎందుచేతనంటే దేవుడా! దేవుడా! అని మొక్కే వాడే దేవుడు. నువ్వే దేవుడివై ఉండి ఇంకో దేవుడికి మొక్కుతున్నావేంటి? ఆ దేవుడు నీ శరీరంలో ఉన్నాడు కాబట్టే నీ శరీరానికి చలనం వచ్చింది. ఆయన నీ శరీరంలో ఉండి నిన్ను నడిపిస్తున్నాడు, అణువణువు ఉండి సృష్టిని నడిపిస్తున్నాడు.

కృతయుగంలో కానీ, త్రేతా యుగంలో కానీ ఋషులందరూ ధ్యానం చేశారు అంటే వాళ్ళ శరీరంలోన దైవం వున్నాడని తెలుసుకున్నాడు కాబట్టి!

ఎవరికైనా పాపభీతి ఉంటే హింస చేయరు. పాపాలు భరించే శక్తి, రోగాలు భరించే శక్తి లేకపోతే హింసను ఆపేస్తారు. ఎవరికైనా హింసను ఆపితే కానీ దుఃఖం తగ్గదు.

ఒకవైపు గీతా పారాయణాలు చేస్తారు, లలితా సహస్రం చదువుతారు, విష్ణు సహస్రం చదువుతారు, రకరకాల పారాయణాలు చేస్తారు, గాయత్రి మంత్రం చదువుతారు. కానీ పలావులు, కోళ్లు, కోడిగుడ్లు తింటారు. పత్రిగారు చికెన్ తిని చర్చికి వెళతారు, మటన్ తిని మసీదులకు వెళతారు, గుడ్లు తిని గుళ్ళకు వెళతారు అంటారు.

మరి ఇంత చదివి ఈ నోటిలో వాటినే వేస్తున్నారు. అంటే ఎంత అజ్ఞానంతో వున్నారో ఆలోచించండి. నోరు భగవంతుడా అని ప్రార్థిస్తుంది, ఆ నోట్లోనే భగవంతుని రూపాలైన జీవులను చంపి వాటి మాంసం వేస్తున్నారు.

మాంసం తింటే నష్టమేమిటి? అని అడుగుతారు. కానీ ఎప్పుడైతే మాంసం తింటారో వారిలో రజోగుణం పెరిగిపోయి కామ వికారాలు, అంటే అన్ని రకాల కోరికలు పెరిగిపోతాయి. వారి స్వార్థం కోసం చేయకూడని పనులు చేస్తారు.

ఎవరికైనా సరస్వతి కటాక్షం రావాలి అంటే! ఆ జ్ఞానం రావాలి అంటే? రక్త మాంసాలు నాలుకకి తగలకూడదు. ఏదైనా తినే ఆహారాన్ని బట్టే వుంటుంది. ఏ విత్తనం వేస్తావో, బయటకు అదే వృక్షం వస్తుంది, అవే ఫలాలు వస్తాయి. హింసపూరితమైన విత్తనం వేస్తే బయటికి వచ్చే ఫలాలు అవే వస్తాయి. అందుకే ఎప్పుడూ సరైన ఆహారం తీసుకోవాలి.

పాప భీతి వున్నవాడు, కర్మ సిద్ధాంతం తెలుసుకున్నవాడు, మాట ద్వారా కానీ, చేత ద్వారా కానీ హింస చెయ్యరు.

ధ్యాన సాధన ఎక్కువయ్యే కొద్దీ తప్పులను సరిదిద్దుకుంటారు, అహింసలో జీవిస్తాడు, మహాత్ముడవుతాడు. అందుకే పాప భీతి వుండాలి అంటారు.

# నీతి

ఈ జ్ఞానం అనేది ఎంత తెలుసుకున్నా ఇంకా తెలుసు కోవాల్సింది వుంటుంది. జ్ఞానం అంటే ప్రతి విషయాన్నీ తెలుసుకోవడమే. ఎందుకు అంటే? ఈ భూమి మీదకి వచ్చింది ప్రతి విషయాన్ని తెలుసుకోవడానికే. అంటే సృష్టిలో తెలియనివి ఎన్నో వున్నాయి. మానవుని కళ్ళకు కనిపించేవి వున్నాయి, మానవుని కళ్ళకు కనిపించనివి వున్నాయి.

ముందు కొన్ని విషయాలు మాస్టర్స్ ద్వారా కానీ, గురువుద్వారా కానీ మనకి తెలియ చేయబడతాయి. అంటే ఆ విషయాలు తెలుసుకోవడానికే మీరు భూమ్మీదకి వచ్చారు కాబట్టి, ధ్యానం చేస్తూ ఎన్నో కొత్త విషయాలు తెలుసు కుంటున్నారు.. మానవుడు ఎలా ప్రవర్తించాలి? ఎలా ఉండాలి? ఏమి వదులు కోవాలి? ఏవి ఆచరించాలి? దైవం వైపు వెళ్ళిన వ్యక్తి ఎలా ఉంటాడు? ప్రపంచం వైపు వెళ్లిన వ్యక్తి ఎలా ఉంటాడు? అజ్ఞాని ఎలా ఉంటాడు? జ్ఞాని ఎలా వుంటాడు? అలా ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నారు.

ఇలాంటి ఎన్నో విషయాలు ధ్యానమార్గంలోకి వచ్చాక తెలుస్తాయి. ధ్యానమార్గంలోకి రాకపోతే అన్నీ నాకు తెలుసు అనుకుంటారు. నాకు తెలిసిందే సరి అయినదని అనుకుంటారు. కానీ ధ్యానమార్గంలోకి వచ్చాక తెలుసుకునే విషయాలు చూస్తే ఆశ్చర్యమేస్తుంది. మానవునకు తెలిసింది పరమాణువు అయితే, తెలుసుకోవలసినది పర్వతం అంత వుంది అని తెలుస్తుంది. ఇంత జ్ఞానం ఈ సృష్టిలో ఉన్నప్పుడు తెలుసు కోవడానికి ఎన్ని జన్మలు పడుతుందో అని ఆశ్చర్యం వేస్తుంది. అయితే యోగమార్గంలోకి వచ్చాక చేసే సాధనను బట్టి, చేసే ప్రయత్నాన్ని బట్టి కొన్ని జన్మలలోనే అన్నీ తెలుసుకోవచ్చు.

దానికి "శ్వాస మీద ధ్యాస" ధ్యాన సాధన చేసి మనసు శుద్ధి చేసి ఇంకా ఇంకా తెలుసుకోవాలనే తపన వున్నప్పుడు ఆ ప్రకృతి అన్ని విషయాలు గురువు ద్వారా, సజ్జనుల ద్వారా, లేదా పుస్తకాల ద్వారా, ఏదో విధంగా జ్ఞానం అందివ్వబడుతుంది.

ఎప్పుడూ కూడా అజ్ఞాని ఆలోచనలు వేరుగా వుంటాయి, ధ్యాన మార్గంలో ఉన్న జ్ఞాని ఆలోచనలు వేరుగా ఉంటాయి. ప్రపంచమంతా డబ్బు వెనకాల పరిగెడుతున్న ఈ రోజులలో జ్ఞాని సమయాన్ని సద్వినియోగం చేసుకుని, జ్ఞానం ఎలా పెంచుకోవాలో తెలుసుకుంటున్నాడు. జ్ఞానికి సమయం సరిపోదు, ఖాళీ దొరికితే పుస్తకం చదువుకోవటం లేదా ధ్యానం చేయటం చేస్తాడు, అహింసలో జీవిస్తాడు, హింస చెయ్యడు.

ఈ రోజు నీతి అంటే ఏమిటి? నీతిగా జీవించాలి అంటే ఏమి చెయ్యాలి? నీతిగా జీవిస్తే ఏమి వస్తుంది? అన్నవి తెలుసుకుందాం. ముందు సంఘ నీతి అంటే ఏమిటో తెలుసుకుందాం.

సంఘం అంటే? మన చుట్టూ ఉన్న ప్రపంచమే! ఈ ప్రపంచంలో మానవుల దగ్గర్నుంచి అన్ని రకాల జీవులు ఈ సంఘంలో ఉన్నాయి. ఈ సంఘనీతి గురించి వేదాలు, భారత ఇతిహాస పురాణాలు ఒకటే చెప్పాయి, "పరోపకారం పుణ్యం, పరపీడనం పాపం" అని. అంటే ఎదుటివారికి ఉప యోగపడే పని చేస్తే, సహాయం చేస్తే పుణ్యం, పీడించుకు తింటే పాపము అని చెప్పాయి.

అంటే ఈ సంఘంలో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరిని ప్రేమించగలగాలి, అందరిలో దైవత్వం చూడగలగాలి, "అహం బ్రహ్మాస్మి" అంటే నేను దైవాన్ని అని అనుకోవడం కాదు, "తత్వమసి" అంటే అందరిలోనూ ఆ దైవం ఉంది అని తెలుసుకుంటారో! అప్పుడు మీలో ప్రేమ వుంటుంది. ఇదే సంఘనీతి అంటే? ఎవరిలోనైనా సంఘనీతి ఉంటే ప్రేమ, శాంతి ఉద్భవిస్తాయి.

సంఘంలో నువ్వెలా అయితే బ్రతకాలని అనుకుంటావో! నువ్వు ఎలా అయితే స్వేచ్ఛను కోరుకుంటున్నావో! నీ జీవితంలో ఏది నేర్చుకోవాలని అనుకుంటున్నావో! అలాగే ఈ సంఘంలో ప్రతి ఒక్కరికి నేర్చుకోవడానికి అవకాశం ఉంది, నేర్పడానికి అవకాశం ఉంది. అందుకే ఎవరి స్వేచ్ఛని, ఎవరి జీవితాన్ని అడ్డుకోవడానికి ఎవరికీ హక్కు లేదు అని తెలుసుకోవాలి.

ఆ ప్రేమ రావాలి? దేహాన్ని చూడటం కాదు, దేహంలోని దైవాన్ని

చూడగలగాలి. కనపడేది దేహమే కానీ, దేహంలో వున్న దేహిని చూడగలగాలి. ఆఖరికి చిన్న చీమలో కూడా దైవాన్ని చూడగలగాలి. దానికి ధ్యాన సాధన తీవ్రంగా చేయాలి, సాధన చేసే కొద్దీ ప్రేమ తత్వం పెరుగుతుంది.

పత్రి గారు ఈ భూమి ఒక పాఠశాలని, ఈ పాఠశాలలో ఎందరో గురువులు దగ్గర ఎన్నో పాఠాలు నేర్చుకోవాలని చెప్పారు. నేర్చుకున్న పాఠాలు అందరికీ నేర్పాలి అని పత్రిగారు చెప్పడం జరిగింది.

ఆత్మ మీద ప్రేమ లేకపోతే ఇతరులని ప్రేమించలేరు. అందుచేత ఆత్మ మీద ప్రేమ వుండాలి. అంతేకాదు ప్రేమ ఉంటే ఎలా ఉంటాము? శాంతిగా ఉంటే ఎలా వుంటాము? అన్నది నేర్చుకుంటూ ఆధ్యాత్మికంగా ఎదగడానికి ప్రయత్నించాలి.

ప్రేమ వుంటే త్యాగం వుంటుంది. అందుచేత ఎవరిపై ప్రేమ వుంటే వారి విషయంలో త్యాగ పూర్వకంగా వ్యవహరిస్తారు. అలాగే భగవంతుడు అంటే ఎక్కువ ఇష్టం వున్నప్పుడు, కష్టాలు ఓర్చుకునే శక్తి వుండాలి. ఎందుచేతనంటే కష్టాలను ఓర్చుకున్నప్పుడే, భగవంతుడు మీద మనకు ప్రేమ వున్నట్టు. అందుచేత కష్టంలో ఉన్నప్పుడు దైవాన్ని విమర్శించకూడదు. నేను ఎదగడానికి నాకు వచ్చిన పరీక్ష అని అనుకుంటూ ముందుకు వెళ్ళాలి. అప్పుడు భగవంతుడి మీద ప్రేమ ఉన్నట్టు. ఏం జరిగినా నా మంచికే అనుకోగలిగితే! అన్నీ మంచే జరుగుతాయి, కష్టం కూడా మంచే అవుతుంది.

అందుకే మలయాళ స్వామి వారు చెప్తారు “కష్టాలు కూడా దేవుడిచ్చిన వరాలు” అంటారు. కారణం కష్టపడకకుండా ఏ ఫలితం రాదు, కష్టపడినప్పుడే మనిషి ఎదుగుదల వుంటుంది. పత్రిగారు కూడా నీ జీవితంలోని “కష్టాలు, నష్టాలు, అవమానాలు” నీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు సోపానాలు అన్నారు.

మలయాళ స్వామి వారు చిన్న ఉదాహరణ చెప్పారు. ఒక ఇనుప ముక్క ఖరీదు వంద రూపాయలు అనుకోండి. ఆ ఇనుప ముక్కను గుర్రపు నాడాలుగా మారిస్తే దాని విలువ 500 రూపాయలు అవుతుందట. అదే ఇనుపముక్కని సూదులుగా మారిస్తే 1000 రూపాయలు వస్తాయట. అదే

ఇనుప ముక్కని స్ప్రింగ్‌లు గా మారుస్తే 2000 రూపాయలు వస్తాయి. అంటే ఒక్క వంద రూపాయలు విలువ చేసే ఇనుప ముక్కకి ఇంత విలువ పెరిగింది అంటే? అది మంటలో కాలి, సుత్తి దెబ్బలు తిని మారితేనే కదా అంత విలువ పెరిగింది. అలాగే మానవునకు కష్టాలు వచ్చినప్పుడు, బాధలు వచ్చినప్పుడు ఆ కష్టాల కొలిమిలో కాలి, బాధలనే సుత్తి దెబ్బలు తిన్నప్పుడే, మెల్లిగా మానవుడే మాధవుడు అవుతాడు అని మలయాళ స్వామి వారు చెప్పేవారు.

అందుకే ఎవరైతే భగవంతుడికి ఇష్టులో వాళ్లని కష్టాల నుంచి తమ వైపు తిప్పుకుంటాడు అని మనకి యోగులు చెబుతూ ఉండేవారు. అందుకే కష్టాలు వచ్చినప్పుడు అయ్యో నాకు కష్టాలు వచ్చాయి, దేవుడికి నా మీద దయ లేదు అంటూ ఇంకో దేవుడు అంటూ దేవుణ్ణి మార్చడం కాదు, దేవుడు ఒక్కడే! నీ కర్మ ఫలాలే నీకు కష్టాల రూపంలో వస్తున్నాయి అని తెలుసుకోవాలి.

అంతేకాదు ప్రేమతత్వం మనలో వుంటే మానవత్వాన్ని దివ్యత్వంగా మార్చగలిగే శక్తి వస్తుంది. మనము ఇప్పుడు మానవులం, మానవత్వంతో వున్నాము. కానీ మనమే దైవాలుగా మారినపుడు దివ్యత్వం వస్తుంది. ఎవరైతే ధ్యానం చేస్తారో వారు తప్పకుండా దైవాలు అవుతారు.

ఎవరైతే భగవంతుని అంటే ఆత్మను ప్రేమిస్తారో! వారు ధ్యాన సాధన వల్ల దివ్యులుగా మారిపోతారు. అంటే పశువు, పశుపతిగా మారుతాడు. పశువు మూడు పనులే చేస్తుంది, 1) తినడం, 2) త్రాగడం, 3) పడుకోవటం. మరి మానవుడిగా పుట్టిన వారు ఆ మూడు పనులే చేస్తే నాలుగు కాళ్ల జంతువుతో సమానం. అటువంటి పశు లక్షణాలు వున్న మానవుడు మాధవుడిగా అంటే దైవంగా ఎలా మారిపోతాడు.

ప్రేమ శత్రువుల్ని కూడా మిత్రులుగా మార్చగలదు. అందుకే బాబాగారు నరులను నువ్వు ప్రేమిస్తే నారాయణ సేవ అంటారు. అందరినీ ప్రేమించినపుడు ఇంకా పైకి ఎదుగుతారు. అలా ఎవరినైనా సరే ప్రేమించగలిగే శక్తి వున్నప్పుడు క్షమ అలవాటవుతుంది, అందరినీ క్షమించగలుగుతారు. అందుకే ఎవరైనా నీకు నష్టం కలిగించినా, అవమానించినా వారిని తిట్టవద్దుని పెద్దలు చెబుతారు.

అందుకే “తిట్టుకి తోబుట్టువులని పుట్టించవద్దు” అన్నారు మహాత్ములు.

అంటే మహాత్ములు చెప్పే మాటలు ఆచరిస్తే క్షమించడం వస్తుంది. బుద్ధుడు కూడా “తిట్టుకు తోబుట్టువులని ఎప్పుడూ పుట్టించవద్దు” అని అన్నాడు. అంత సహనం రావాలి అంటే ప్రేమ, క్షమా ఈ రెండు గుణాలు ఉండాలి. ఈ రెండు గుణాలు రావాలంటే ముందు అందరిలో దైవత్వాన్ని చూడగలగాలి.

క్షమ ఎవరిలో అయితే ఉండదో, వాడి జీవితంలో అన్ని “క్షామాలే”. అంటే వాడికి శాంతి ఉండదు, సుఖం ఉండదు, ఆనందం వుండదు. ఎదుటి వాడిని క్షమించలేనప్పుడు ప్రకృతి వాడిని ఎందుకు క్షమిస్తుంది?

క్షమ లేని వాడికి ప్రేమ లేని వాడికి మొదట వచ్చేది అసూయ. ఎవరైనా గొప్పగా వుంటే అసూయ వస్తుంది. ఎటువంటి వారైనా వారి మీద ప్రేమ లేకపోతే వారు మంచి చేసినా అసూయతో ద్వేషిస్తారు. ఈ అసూయ, అనసూయ అక్క చెల్లెలు అట.

అసూయ యొక్క పిల్లలు కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు. మరి ఎప్పుడైతే అసూయ వచ్చిందో అప్పుడు ఈ దుర్గుణాలన్నీ వుంటాయి.

మనం ఏమని చెప్పుకున్నాము అంటే ప్రేమ వుంటేనే క్షమ ఉంటుంది. ప్రేమ, క్షమ లేకపోతే అసూయ ప్రవేశిస్తుంది. ప్రేమ, క్షమ ఉన్నప్పుడు అనసూయలం అవుతాము. ప్రేమ క్షమా లేకపోతే అసూయలం అవుతాము అని మనం చెప్పుకున్నాం. ఆ రెండు వున్న అనసూయ బ్రహ్మ విష్ణు మహేశ్వరులని తన పాపలుగా ఎలా ఆడించిందో అనసూయ చరిత్ర నుంచి తెలుసుకోవచ్చు.

అందుచేత వాక్కును బ్రహ్మగా పోలుస్తారు కాబట్టి, వాక్కుని అదుపులో వుంచుకోవాలి. మనసు విష్ణువుగా పోలుస్తారు కాబట్టి మనసుని శుద్ధంగా వుంచుకోవాలి. హృదయాన్ని శివుడుగా పోలుస్తారు కాబట్టి హృదయాన్ని పవిత్రంగా వుంచుకోవాలి.

చూడండి ఎవరితో అయినా మాట్లాడినప్పుడు ప్రేమగా మాట్లాడితే అందరూ బంధువులు అవుతారు, నీకున్న అహంకారం చూపించి మాట్లాడితే

నీకు నువ్వే శత్రువు అవుతావు. అదే ప్రేమతో ఉంటే నీ చుట్టూ వున్నవారు ప్రేమగా వుంటారు. అందుకే సంఘనీతి అంటే సంఘంలో అందరినీ దైవాలుగా చూడగలగడం.

ఇంకొక విషయం ఏమిటంటే? శాంతిగా ఉండడం. ప్రతి వ్యక్తి శాంతిగా వుండలేక పోవడానికి కారణం ప్రతి వాళ్ళలో ఆందోళన, చింత వుండడమే.

శ్రీ కృష్ణుల వారు ఏమన్నారంటే?

**శ్లో॥ అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ (భ.గీ. 9-22)**

తా:- ఎవరు ఇతర చింతలు లేకుండా నన్ను ధ్యానించుచున్నారో, ఎల్లప్పుడు నాయందే నిష్ఠ కలిగి వుంటారో అట్టి వారి యొక్క యోగక్షేమాలను నేను వహించుచున్నాను.

భగవానుడు ఎంత చెప్పినా ఎవరూ చింత వదలడం లేదు. ఒక్కొక్కరికి ఎన్ని రకాలు చింతలు వున్నాయో! ఆ చింతలన్నీ వదిలితే కానీ శాంతి అనేది ఉండదు. చూడండి ప్రెగ్నెన్సీ వచ్చింది అనుకుందాం, కానీ అమ్మాయి పుడుతుందా? అబ్బాయి పుడతాడా? అని చింత వుంటుంది.

తరువాత పెరగడం ఒక చింత. ఐదేళ్లు వచ్చాక వాడికి స్కూల్ కి వెళ్ళడం చింత, ఆ పిల్లాడు మళ్లీ సరిగ్గా చదవకపోతే చింత. ఇలా ఎన్ని చింతలో. అలాగే ర్యాంక్ రాకపోతే చింత. మంచి స్కూల్లో సీటు రాకపోతే చింత. డబ్బు సంపాదించకపోతే చింత. అలా ఎన్ని చింతలో!

పిల్లవాడుఉ పెరిగాడు, ఇంకొంచెం ఎదిగాడు, యవ్వనంలోకి వచ్చాడు. మరి వాడికి యవ్వనంలో ఉన్నప్పుడు చదువు చదివించడం చింత. చదువుతున్నాడో లేదో, బయట తిరుగుళ్ళు తిరుగుతున్నాడో ఏమో అని చింత. చదువు అయిపోయింది. ఉద్యోగం చింత, ఉద్యోగం అయిపోయాక పెళ్లి చింత. ఇలా చూసుకుంటే మళ్ళీ వాడికి సంసారం గురించి చింత. అలా చూసుకుంటే ఎన్ని చింతలు వుంటాయో మనిషికి.

కష్టాలు వస్తే చింత, రోగాలు వస్తే చింత, చుట్టాలతో చింత,

బంధువులతో చింత, ఊరోళ్లతో చింత, పిల్లలతో చింత, ఎవరికీ ఏమీ లేకపోతే పని మనుషులతో కూడా చింతే, ఎన్ని చింతలు వున్నాయో చెప్పండి.

అయితే ఈ చింతలన్నీ పోవాలి అంటే ధ్యానం చేసి జ్ఞానం పొందాలి. గీతలో చెప్పాడు కదా? అన్ని చింతలు వదిలేయి. కాసేపు నా మీద అంటే ఆత్మ మీద చింత పెట్టు. నీ చింతలు నేను చూసుకుంటాను అని అన్నాడు కానీ అజ్ఞానంలో వున్నంతసేపు మాయ కమ్మి జీవుడు తానే పరిష్కరించుకోగలనని అనుకుంటాడు. కానీ ఎప్పుడైతే భగవంతుడి వైపు తిరుగుతాడో! అప్పుడే వాడి చింతలకి పరిష్కారం దొరుకుతుంది, లేకపోతే చచ్చే వరకు ఈ చింతలతో చావాల్సిందే!

కానీ ఎవరైతే ధ్యానం చేస్తారో, ఎవరైతే ఆత్మవైపు తిరుగుతారో, అప్పుడు ఏ చింత లేకుండా నిశ్చింత గా ఉంటాడు. కానీ ఈ చిన్న సత్యం తెలుసుకోరు, ఎందుకు అంటే అహంకారం.

అందుచేత ఏది జరగాలో అది జరుగుతుంది. జరిగే దానికి సాక్షి భూతంగా గమనించడమే. జరిగేవన్నీ మన మంచికే అని అనుకోవడమే మన పని. అలా ఉంటారు యోగులు, అందుకే వాళ్ళు ఎప్పుడు నిశ్చింతగా వుంటారు.

అందుకే సంఘనీతి వుంటే ప్రేమ శాంతి వస్తుంది, క్షమాగుణం వుంటుంది, అసూయ వుండదు, అనసూయకు వారసులు అవుతారు. అందుచేత ధ్యానము, జ్ఞానము రెండూ ఉంటేనే ఈ సంఘనీతి వస్తుంది.

మా మావగారు పోయినపుడు మా అత్తగారికి 11వ రోజు మంగళవారం అయింది. ఎవరు కూడా ఆవిడ దగ్గరకు వెళ్ళటానికి భయపడ్డారు. కానీ నేను ఆవిడ గదిలోకి కాఫీ ఇచ్చాను. అంటే ఎందుకో తెలియదు చిన్నప్పటినుంచి నాకు ఇలాంటి సెంటిమెంట్స్ అంటే నమ్మకం లేదు. ఎవరి జీవితమైనా వారు చేసుకున్న కర్మలు బట్టే వుంటుంది.

వారంలో ఏడు రోజులూ భగవంతుడు నిర్దేశించిన రోజులు. అందులో మంచి రోజు, చెడ్డ రోజు ఎలా వుంటాయి? నీ మనసు మంచిగా ఉంటే అది మంచి రోజు అవుతుంది, చెడ్డగా ఉంటే చెడు రోజు అవుతుంది. ఒకే

ముహూర్తంలో పెళ్లిళ్లు చేస్తారు. మరి ఒకరికి మంచి జరుగుతుంది, ఒకరికి చెడు జరుగుతుంది. అంటే వారి కర్మలని బట్టి జరుగుతుంది కానీమంచి రోజుని బట్టి కాదు కదా? మనం మాట ద్వారా కానీ, చేత ద్వారా కాని ఎవరికి చెడు చేయకూడదు, అశాంతికి గురి చేయకూడదు.

ఎవరినీ అవమానించకూడదు, ఆవిడ ఎదవ ఆవిడని, లేదా పిల్లలు లేని గొడ్రాలని బాధింకూడదు. వాళ్లు ఎదురు రాకూడదు అంటారు.

అవి చేయకుండా మంచి భావాలతో మంచిగా ఉండాలి అంటే మనం శాంతిగా ఉంటూ అందరినీ శాంతిగా ఉంచాలి. చూడండి ఒకళ్ళని సంతోషంగా, వుంచిన రోజు మన మనసు చాలా ఆనందంగా శాంతిగా, తృప్తిగా ఉంటుంది.


ఎవరినైనా బాధపెట్టిన రోజు మన మనసులో అశాంతి మిగులుతుంది, ఆనందం ఉండదు, ఎందుకంటే ? వారు కూడా దైవం అని మర్చిపోయావు. అందుకని ఎప్పుడైతే సంఘంలో మనం ఒక మనిషివై ఉన్నప్పుడు అందరినీ ప్రేమించాలి, అందరినీ శాంతిగా వుండనివ్వాలి, అందరినీ క్షమించగలగాలి.


ఇలా ప్రతీదీ నేర్చుకోవాలి, నేర్చుకొని గొప్పగా ఎదగాలి. ఎందుకంటే సాధన అనేది మన దగ్గర ఉంది. సాధనలో ఏదైనా సాధించవచ్చు. ఎంత గొప్పగా ఎదుగుతామో, గురువు మెచ్చిన శిష్యుల లాగా మనం ఉంటాం. ఆ ఎదుగుదల అన్నది మన ప్రవర్తన, మనం నేర్చుకునే జ్ఞానం, మనం చేసే సాధన బట్టి వుంటూ ఉంటుంది.


అందుకే మనం ఎలా ఉండాలి అంటే దైవం మీద ప్రీతితో ఉండి సత్యాన్ని ధర్మాన్ని పాటిస్తూ, పాప భీతితో అహింస మార్గంలో వుంటూ సంఘనీతి పాటించాలి. సంఘనీతి పాటిస్తున్నాము అంటే మనం ప్రేమతో వుంటూ, అందరినీ శాంతిగా వుంచుతూ మరి క్షమాగుణంతో ఉంటూ ముందుకి వెళ్లగలగాలి. అప్పుడు మనం చాలా గొప్పగా ఎదుగుతాము. దేనికైనా ధ్యానము, జ్ఞానము వుంటేనే ఏదైనా పాటించగలం. ధ్యానం లేకుండా పురాణ కాలక్షేపం లాగా ఎన్ని విన్నా ఎన్ని చెప్పినా వృధా.


ధ్యానం లేని జీవితంలో ఎలా వుంటుందంటే? నీటిమీద రాత లాగా


వుంటుంది. ధ్యానమున్న జీవితంలో ఏదైనా సరే రాతి మీద రాత లాగా వుంటుంది. నీటి మీద రాతలు మొదటి అక్షరం నుంచి చివరి అక్షరానికి వచ్చేటప్పటికి ముందు అక్షరాలు కనిపించవు. అలాగే ఈ పాఠం చివరికి వచ్చేటప్పటికి స్టార్ట్ చేసిన పాఠం ఎగిరిపోతుంది. కానీ ఒక జ్ఞాని ఏం చేస్తాడు ప్రతిదీ ఆచరణలో పెట్టుకుంటాడు కాబట్టి అవి రాతి మీద రాతల్లాగ శాశ్వతంగా పరంపరగా అందరూ నేర్చుకుంటారు. అందుకే అవి రాతి మీద రాతలు అంటారన్నమాట. మరి ఇవన్నీ మనం ఆచరిద్దాం, ఆచరించి అందర్నీ ఆనందంగా ఉంచితే అదే అసలైన జీవితం.




"తన సుఖం కోసం
ఇతరులను బాధ పెట్టడం అమానుషత్వం..
చిన్న, చిన్న పనులు చేస్తూ గొప్పలు చెప్పుకోవడం డంభం
ఇతరులను అవమానించడం.. బాధ పెట్టడం హింస
ఎదుటివారిని జీవుడిగా చూడడం అజ్ఞానం"
"బ్రహ్మ విద్వరిష్ఠ" తటవర్తి రాజ్యలక్ష్మి గారు


"పరిగెత్తే మనసును నిలబెట్టగలిగే శక్తి
ఒక్క సాధనకు మాత్రమే ఉంది"
..."బ్రహ్మ విద్వరిష్ఠ" తటవర్తి రాజ్యలక్ష్మి గారు



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.

నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.

ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం

వివరాలకు : **తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తి వారి వీధి, భీమవరం - **534 201.**
సెల్ : 94403 09812, 94901 71853

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

**a) Channel Name : Tatavarthy Veera Raghava Rao.** ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

**b)** అలాగే **PMC** వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క **YouTube Channel** ప్రారంభించారు. **Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao**

**c)** తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు **Tatavarty Spiritual Trainees** ఛానెల్‌లో చూడండి.

**d) Direct** గా **YouTube app** లోకి వెళ్ళి **search bar** లో **Tatavarthy Veera Raghava Rao** అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

**website address : www.tst.org.in**

**a)** తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు **Google Maps Location** తెలుసుకోవచ్చు.

**b)** తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు **PDF** రూపంలో కలవు. వాటిని ఉచితంగా **Download** చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

**c)** తటవర్తి దంపతుల సందేశాలు **Concept** వారీగా **YouTube Play lists** రూపంలో ఇవ్వడం జరిగింది.

**d)** తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

**e)** తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

**5.** భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) భగవంతుడంటే - రూ.130/-
5) సత్యమార్గం - రూ.160/-
6) ఆత్మ శాస్త్రం - రూ.130/-
7) ధ్యాన శాస్త్రం - రూ.130/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) ధ్యాన శక్తి - రూ.130/-
10) తెలుసుకోండి - రూ.130/-
11) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
12) మరణించకముందే మరణించాలి- రూ.130/-
13) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) - రూ.160/-
14) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
15) గీతాసందేశం - రూ.120/-
16) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
17) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
18) కర్మ సిద్ధాంతం - రూ.80/-
19) ధ్యానమంటే ? - రూ.80/-
20) త్రివిధాలు - రూ.80/-
21) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
22) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
23) జ్ఞాన జ్యోతి - రూ.70/-
24) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
25) మరణం తర్వాత కూడా వచ్చేవి- రూ.70/-
26) జ్ఞానమాల (తటవర్తి రాజ్యలక్ష్మి) - రూ.70/-
27) దత్తాత్రేయుని 24 మంది గురువులు (రాజ్యలక్ష్మి )-రూ.70/-
28) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
29) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
30) బుద్ధుని సందేశాలు - రూ.70/-
31) భూతదయే దైవత్వం - రూ.70/-
32) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
33) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
34) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
35) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
36) అతీంద్రియ శక్తులు - రూ.60/-
37) ఆలోచించండి - రూ.60/-
38) నిర్వాణ మార్గం - రూ.60/-
39) మానవుని కర్తవ్యాలు (తటవర్తి రాజ్యలక్ష్మి)- రూ.50/-
40) సంకల్పమంటే? - రూ.50/-
41) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
42) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
43) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.50/-
44) ప్రీతి,భీతి, నీతి (తటవర్తి రాజ్యలక్ష్మి) - రూ.40/-
45) సత్యం - రూ.40/-
46) చక్రాలు - రూ.40/-
47) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
48) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
49) మౌన ధ్యానం - రూ.40/-
50) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
51) శాకాహారమే మానవాహారం - రూ.15/-
52) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు : తటవర్తి వీర రాఘవరావు,
తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.
సెల్ : 9440309812, 9490171853



ప్రీతి దేని మీద వుండాలి? భీతి దేని మీద వుండాలి? నీతి దేని మీద వుండాలి ? ఎక్కడ ఎలా ప్రవర్తించాలి? ఏ విషయం మీద ఎలా ఉండాలి? ఎంత శ్రద్ధ వుండాలి? అనేది మనం తెలుసుకోవలసిన విషయాలు. మనం దేనిమీద "ప్రీతి" అంటే "ఇష్టం" చూపిస్తున్నాము? దేని మీద ఇష్టం చూపించాలి? దేని మీద ఇష్టం చూపిస్తే మన జన్మ సార్థకం అవుతుంది? అన్నది తెలుసుకోవాలి. ముఖ్యంగా సత్యము, ధర్మము. ఈ రెండిటి మీద "ప్రీతి" ఉంటే మన జీవితం బాగుంటుంది.

భీతి అంటే భయం. దేని మీద భయం వుండాలి? అంటే పాపకర్మలు చేసేటప్పుడు భయం ఉండాలి, హింస చేసేటప్పుడు భయం వుండాలి. 'పాప భీతి' వున్నవారు హింసే చెయ్యరు. పాప భీతి ఉన్నవాడు ఎప్పుడూ జీవహింసే కాదు ఎటువంటి హింస చెయ్యడు, ఎవరినీ ఏ రకంగానూ హింసించడు. అహింస మార్గంలోనే వుంటాడు.

నీతి అంటే ఏమిటి? నీతిగా జీవించాలి అంటే ఏమి చెయ్యాలి? నీతిగా జీవిస్తే ఏమి వస్తుంది? అందరిలో దైవత్వం చూడగలగాలి, "అహం బ్రహ్మాస్మి" అంటే నేను దైవాన్ని అని అనుకోవడం కాదు, "తత్వమసి" అంటే అందరిలోనూ ఆ దైవం ఉంది అని ఎప్పుడైతే ఆ దైవత్వాన్ని చూస్తారో అప్పుడు మీలో ప్రేమ వస్తూ ఉంటుంది. ప్రేమ శత్రువుల్ని కూడా మిత్రులుగా మార్చగలదు. అందుకే బాబాగారు నరులను నువ్వు ప్రేమిస్తే నారాయణ సేవ అంటారు.

- తటవర్తి రాజ్యలక్ష్మి

రూ.60/-